teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు ...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 213 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 4 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీలపై వేటు

బడ్జెట్ సమావేశాల నుంచి 8 మంది సస్పెన్షన్

రాహుల్ గాంధీ చైనా వ్యాఖ్యలపై రసాభాస






చట్టాలు పాటించకుంటే

## దేశం విడిచి వెళ్ళండి

మెటాపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

వ్యక్తిగత డేటాతో ఆటలాడితే సహించేది లేదు

సిజేఐ జస్టిస్ సూర్యాకాంత్ హెచ్చరిక

.. వివరాలు 2లో



## ఎమ్మెల్యేల ఫిరాయింపులపై స్పీకర్ యాక్షన్

నేడు కడియం శ్రీహరి అనర్హత పిటిషన్‌పై విచారణ

.. వివరాలు 2లో



# దేశవ్యాప్త సమ్మె



"ఓలా, ఉబెర్, ర్యాపిడో డ్రైవర్ల పిలుపు"

ఫిబ్రవరి 7న నిలిచిపోనున్న క్యాబ్ సేవలు

ఓలా, ఉబెర్, ర్యాపిడో డ్రైవర్లు దేశ వ్యాప్త సమ్మెకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 7వ తేదీన దేశ వ్యాప్తంగా స్ట్రైక్ నిర్వహిస్తామని హెచ్చరించారు. తమ శారీరక శ్రమను ఈ ప్లాట్ ఫామ్స్ దోచుకుంటున్నాయని దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడానికి వ్యతిరేకంగా సమ్మెకు దిగుతున్నట్లు తెలంగాణ యప్ బేస్డ్ డ్రైవర్స్ ఫోరమ్ మంగళవారం ప్రకటించింది.

## తెలంగాణలో కామన్ బిల్ విప్లవం

నీళ్లు, నిప్పు, ఆస్తి పన్ను కలిపి ఒకే బిల్లు

జీహెచ్ఎంసీలో పైలెట్ ప్రాజెక్ట్




హైదరాబాద్, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కామన్ బిల్ విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలపై ఎలాంటి భారం వేయకుండానే గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఆదాయాన్ని పెంచడానికి చర్యలు తీసుకునేందుకు చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగానే మొదట జీహెచ్ఎంసీ ఏరియాను పైలెట్ ప్రాజెక్టుగా

మిగతా 2 లో

## నిరుద్యోగులకు టీజీపీఎస్సీ అలర్ట్

ఓటీఆర్ అప్‌డేట్‌కు గడువు పొడిగింపు

ఫిబ్రవరి 25 వరకు అవకాశం

అప్‌డేట్ చేయకుంటే దరఖాస్తుకు నో ఛాన్స్




తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని నిరుద్యోగ అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముఖ్యమైన సమాచారాన్ని అందించింది. వన్ టైమ్ రిజిస్ట్రేషన్ డేటాను అప్‌డేట్ చేసుకునే గడువును ఫిబ్రవరి 25వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం ప్రకటించారు. వాస్తవానికి ఈ గడువు ఫిబ్రవరి 9తో ముగియాల్సి ఉండగా, అభ్యర్థుల విజ్ఞప్తుల మేరకు

మిగతా 2 లో

## గురుకులాలు విద్యానిలయాలా "విషసర్పాలకు ఆవాసాలా"?



- ప్రభుత్వ వైఫల్యంపై హరీశ్ రావు నిప్పులు
- అశ్రిత ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన
- మృత్యువుతో పోరాడుతున్న ఇంటర్ విద్యార్థిని

02



## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికకు లైన్ క్లియర్

- సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు
- కొత్త నియామకాలకు ఆటంకం లేదని వెల్లడి

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు మరోసారి క్లారిటీ

మిగతా 2 లో

## తెలంగాణకు కేంద్రం భారీ కానుక



- యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ పనులకు ప్రధాని భూమి పూజ
- రూ. 5.50 లక్షల కోట్లతో మూడు హై స్పీడ్ రైల్స్
- ప్రాజెక్టులు రానున్నాయని కిషన్ రెడ్డి వెల్లడి

02




## తెలంగాణ మున్సిపల్ సమరం

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

11న పోలింగ్, 13న ఫలితాలు

16న మేయర్, చైర్‌పర్సన్ల ఎన్నిక

05

## ఉద్యోగాల హామీపై నయవంచన

నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయం

రేవంత్ సర్కారుపై కేటీఆర్ తీవ్ర ధ్వజం



హైదరాబాద్, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): మరో గ్యారెంటీ నుంచి సీఎం రేవంత్ రెడ్డి నిసిగ్గుగా ముఖం చాటేసిందని, దీనిపై తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందన్నారు బీఆర్ఎస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలిస్తామని అడ్డదారిలో గద్దెనెక్కిన రేవంత్ తీరా అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి

మిగతా 5 లో

## మేడారం జాతర గ్రాండ్ సక్సెస్



- రెండున్నర కోట్ల భక్తులు వచ్చారని మంత్రి సీతక్క వెల్లడి
- జాతర ప్రశాంతంగా ముగిసిందని స్పష్టీకరణ

05

## రైతు నేస్తంలో మంత్రి తుమ్మల ముఖాముఖి

సాగు కష్టాలు, సక్సెస్ స్టోరీలపై క్షేత్రస్థాయి చర్చ

యూరియా యాప్‌పై ఆరా



## గ్రూప్-1 పిటిషనర్‌కు బెదిరింపులు



05

డీజీపీకి విన్నవించినా ఫలితం లేదని పిటిషనర్ వాదన

రక్షణపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశం

# దేశవ్యాప్త సమ్మె

## "ఓలా, ఉబెర్, ర్యాపిడో డ్రైవర్ల పిలుపు"




న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): ఓలా, ఉబెర్, ర్యాపిడో డ్రైవర్లు దేశ వ్యాప్త సమ్మెకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 7వ తేదీన దేశ వ్యాప్తంగా స్ట్రైక్ నిర్వహిస్తామని హెచ్చరించారు. తమ శారీరక శ్రమను ఈ ప్లాట్ ఫామ్స్ దోచుకుంటున్నాయని దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడానికి వ్యతిరేకంగా సమ్మెకు దిగుతున్నట్లు తెలంగాణ యప్ బేస్డ్ డ్రైవర్స్ ఫోరమ్ మంగళవారం ప్రకటించింది. మోటార్ వెహికల్ అగ్రిగేటర్ గైడ్ లైన్స్, 2025 విడుదల చేసినప్పటికీ కంపెనీలు ఏకపక్షంగా చార్జీలు నిర్ణయిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. డ్రైవర్ల నుంచి దోపిడీ చేస్తున్నాయని దీంతో డ్రైవర్లు నష్టపోతున్నారని అప్పులపాలవుతున్నట్లు చెబుతున్నారు. డ్రైవర్ల పరిస్థితులపై ప్రభుత్వాలు చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారించడాని ఖండిస్తున్నట్లు తెలిపారు. కంపెనీల అత్యాశ కారణంగా డ్రైవర్లతో పాటు ప్రయాణికులు కూడా నష్టపోతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మినిమమ్ బేస్ చార్జీలు నిర్ణయించడంలో విఫలమయ్యాయని ఆరోపిస్తున్నారు. ప్లాట్ ఫామ్ లు డ్రైవర్ల ఆదాయాన్ని దోచుకోవడంతో తీవ్రమైన భారం పడుతున్నట్లు చెబుతున్నారు. పెట్రోల్ డీజిల్ ఖర్చులు పెరుగుతుండటం, వెహిల్ మెయింటెనెన్స్ ఖర్చులు, ఇన్సూరెన్స్ తదితర ఖర్చులను డ్రైవర్లపైనే కంపెనీలు వేస్తున్నాయని దీంతో పూటగడవటం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మినిమమ్ బేస్ చార్జీలను నిర్ణయిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా కంపెనీలు ప్రైవేట్ వాహనాలను వినియోగిస్తూ తమ పొట్టకొడుతున్నాయని దీన్ని నివారించాలని కోరుతున్నారు. ఈ అంశంపై ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వాలను వేడుకున్నా లాభం లేకుండా పోయిందని అందుకే దేశ వ్యాప్త సమ్మెకు దిగనున్నట్లు టీఏడిఎఫ్ యూనియన్ ప్రకటించింది. గతంలో క్రిస్మస్ (డిసెంబర్ 25), న్యూ ఇయర్ (డిసెంబర్ 31) సందర్భంగా స్ట్రైక్ నిర్వహించారు. హైదరాబాద్ లో మొత్తం 2 లక్షల మంది గిగ్ వర్కర్లలో 50 వేల మంది డిసెంబర్ 31 సమ్మెలో పాల్గొన్నట్లు యూనియన్ ప్రెసిడెంట్ తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే మరింత ఉధృతంగా సమ్మె నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా హెచ్చరించారు.

# తెలంగాణకు కేంద్రం భారీ కానుక



హైదరాబాద్, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రజలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శుభవార్త చెప్పారు. హైదరాబాద్ నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట మధ్య ఎంఎంటీఎస్ మూడో దశ పనులకు త్వరలోనే ప్రధాని నరేంద్ర మోడీ భూమి పూజ చేస్తారని ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉచితాల కోసమే బడ్జెట్ అన్నట్లుగా ప్రజల్లో ప్రధాన రాజకీయ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఎన్నికల కోసం కాకుండా 'వికసిత్ భారత్' కోసం రూపొందించిన బడ్జెట్ ఇది అని వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు పీఎం ఆవాస్ యోజన పథకం కింద తెలంగాణ రాష్ట్రానికి 4.30 లక్షల ఇళ్లు కేటాయించామని పేర్కొన్నారు. అదేవిధంగా జాతీయ రహదారుల నిర్మాణంలో తెలంగాణకు పెద్దపీట వేశామని తెలిపారు. కొమురవెల్లి, జోగులాంబ రైల్వే స్టేషన్లను త్వరలోనే ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

### రూ.5.50 లక్షల కోట్లతో 3 హై స్పీడ్ రైల్ కారిడార్లు

కేంద్ర ప్రభుత్వం 5 వందే భారత్, 2 అమృత్ భారత్ రైళ్లను తెలంగాణకు ఇచ్చిందని గుర్తు చేశారు. రూ.5.50 లక్షల కోట్లతో 3 హై స్పీడ్ రైల్ కారిడార్లు రాష్ట్రానికి రానున్నాయని తెలిపారు. హైదరాబాద్–యాదగిరిగుట్ట మధ్య ఎంఎంటీఎస్ మూడో దశ పనులకు త్వరలోనే ప్రధాని నరేంద్ర మోడీ భూమి పూజ చేస్తారని పేర్కొన్నారు. ఇక మేడారం జాతరకు కేంద్రం ప్రకటించిన నిధులను రాష్ట్రానికి తీసుకొచ్చే బాధ్యత తనదేనని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీలపై వేటు

మొదటి పేజీ తరువాయి

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్) లోక్‌సభలో 8 మంది కాంగ్రెస్ ఎంపీలను స్పీకర్ సస్పెండ్ చేశారు. బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యేంతవరకు సస్పెన్షన్ చేశారు. సస్పెండ్ అయిన వారిలో కాంగ్రెస్ ఎంపీలు మాణికం ఠాగూర్, గుర్జీత్ ఓజ్లా, రాజా వారింగ్, హిబి ఈడెన్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. స్పీకర్ తీరుకు నిరసనగా పార్లమెంట్ ఆవరణలో సస్పెండ్ అయిన ఎంపీల ఆందోళనకు దిగారు. రాహుల్ గాంధీ 'చైనా' కామెంట్స్‌పై మంగళవారం ఉదయం లోక్‌సభలో చర్చ జరిగింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు రసాభాసగా మారాయి. భారత్–చైనా సరిహద్దు వివాదానికి సంబంధించి మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం. నరవాణే ఇంకా ప్రచురించని పుస్తకం ఆధారంగా వచ్చిన కథనాన్ని ఉటంకిస్తూ భారత్ భూభాగాన్ని చైనా ఆక్రమించిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లోక్‌సభలో వ్యాఖ్యలు చేయడంతో వివాదం నెలకొంది. విపక్ష సభ్యులు సభాపతి చైర్ వైపు కాగితాలను విసిరేయడంతో గందరగోళం నెలకొంది. 8 మంది ప్రతిపక్ష ఎంపీలను లోక్‌సభ సస్పెండ్ చేసింది. ఈ వ్యాఖ్యల్ని హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా ఖండించారు. అనంతరం లోక్‌సభ కార్యకలాపాలు నేటికీ వాయిదా పడ్డాయి. కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ లోక్ సభలో 8 మంది ఎంపీలను సస్పెండ్ చేశారని 8 మందిలో తానూ ఉన్నానని తెలిపారు. స్పీకర్ రాహుల్ గాంధీ మైక్‌ను కట్ చేయడాన్ని ప్రశ్నిస్తే సస్పెండ్ చేశారు. రాహుల్ గాంధీ ఎన్నో సందర్భాలలో వాస్తవాలు మాట్లాడే ప్రయత్నం చేస్తే సమావేశాన్ని వాయిదా వేసే విధంగా ప్రవర్తించారు. దేశ ప్రజల ముందు కాంగ్రెస్ ఎంపీల వలనే సభ వాయిదా పడుతున్నట్టు బీజేపీ ప్రచారం చేస్తున్నారు.నరేంద్ర మోదీ ట్రంప్‌కు సరెండర్ అయ్యారు. రాష్ట్రపతి ప్రసంగంపై జరుగుతున్న డిబేట్‌లో రాహుల్ గాంధీ మాట్లాడుతుంటే ఆయన మైకు కట్ చేశారు. ఆయన మైక్ కట్ చేస్తే మేము ఎందుకు కట్ చేశారని అడిగేందుకు స్పీకర్ పోడియం ముందుకు వెళ్లాం. 8 మందిపై కావాలనే సస్పెన్షన్ వేటు వేశారు. మా నోరు మూయించాలనే ప్రయత్నం బీజేపీ చేస్తుంది. మిగతా ఎంపీలందరూ మా తరఫున ఈరోజు సభలో ప్రశ్నిస్తూనే ఉంటారు. పార్లమెంట్ ఆవరణలో సస్పెన్షన్ గురైన ఎనిమిది మంది ఎంపీలం ఆందోళన చేస్తాం. స్పీకర్ అనే వ్యక్తి ఏ కులానికి చెందినవారనేది మేము చూడలేదు. మాకు అవకాశం ఇవ్వకపోవడంతోనే ఆందోళన చేశాం. మేం మాట్లాడుతుంటే మైకులు కట్ చేస్తున్నారు. బీజేపీ చిల్లర రాజకీయాలు చేస్తుంది అని కిరణ్ కుమార్‌రెడ్డి మండిపడ్డారు.

# గురుకులాలు విద్యానిలయాలా "విషసర్పాలకు ఆవాసాలా"?

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి గురుకులంలో ఇంటర్ విద్యార్థిని అశ్మిత పాముకాటుకు గురై మృత్యువుతో పోరాడుతున్న వార్త కలచివేస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆవేదన చెందారు. హార్వర్డ్ లో సీఎం క్లాస్టీ చదువు గురుకుల విద్యార్థులకు పాము కాట్లు అంటూ మంగళవారం ఎక్స్ వేదికగా ఘటనపై స్పందించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ సంగతి దేవుడెరుగు ఉన్న గురుకులాల పరిస్థితి అధ్వాన్నం చేశారని ఆరోపించారు. పాము కాటుకు గురై ఆసుపత్రిలో చేరిన గురుకుల బిడ్డ ప్రాణానికి రేవంత్ రెడ్డిదే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి, మీ పాలనలో గురుకులాలు విద్యా నిలయాలా? లేక విషసర్పాలకు ఆవాసాలా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా ఇది మీ పరిపాలనా వైఫల్యం కాదా? అని నిలదీశారు. 20 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అంటూ రంగుల లోకం చూపిస్తున్న మీరు గురుకులాలను గాలికి వదిలేయడం సిగ్గుచేటు అని విమర్శలు గుప్పించారు.

### చావుతో పోరాడటానికి వెళ్తున్నారా?

గురుకులాల్లో పిచ్చి మొక్కలు తొలగించే దిక్కు లేదని, చిమ్మచీకట్లో లైట్లు వేసే నాథుడు లేడని. అపరిశుభ్రత కారణంగా నేడు గురుకులాల్లో కుక్క కాట్లు, పాము కాట్లు సర్వసాధారణంగా మారిపోవడం అత్యంత దుర్మార్గం అని ఆరోపించారు. గురుకుల బిడ్డలకు కడుపు నిండా తిండి లేదు ప్రాణాలకు రక్షణ లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్లి విదేశాల్లో ఫోటోలకు పోజులిస్తే ఇక్కడ పేద విద్యార్థులు ఆసుపత్రి పాలై కొట్టుమిట్టాడుతున్నారని పేర్కొన్నారు. తమ పిల్లలు గురుకులాలకు చదువుకోవడానికి వెళ్తున్నారా? లేక చావుతో పోరాడటానికి వెళు న్నారా? అని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారని వెల్లడించారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి పతనమవుతున్న గురుకులాలను కాపాడాలని, విద్యార్థుల భవిష్యత్తును నిలబెట్టాలని కోరారు. పాము కాటు గురైన విద్యార్థిని అశ్మితకు తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి గారు రాజకీయ కక్షసాధింపుల మీద ఉన్న శ్రద్ధలో కొంత అయినా పేద పిల్లల బతుకుపై పెట్టండని విమర్శించారు.

# తెలంగాణలో కామన్ బిల్ విప్లవం

మొదటి పేజీ తరువాయి




ఎంపిక చేశారు. కాగా, ఇప్పటికే ఆదాయాన్ని పెంచుకోవడానికి కసరత్తు చేస్తున్న బల్దియా ముంబై, బెంగళూరు మెట్రోపాలిటన్ నగరాల తరహాలో వాటర్, కరెంట్, ప్రాపర్టీ ట్యాక్స్‌లకు సంబంధించి 'కామన్ బిల్' తీసుకురావాలని నిర్ణయించింది. అందుకు సంబంధించిన చర్యలూ ప్రారంభించింది. దీని కోసం ప్రత్యేకంగా 'మొబైల్ యాప్'ను రెడీ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించిన తర్వాత ఆయన చేతులమీదుగానే ప్రారంభించనున్నారు. పై

### పైలెట్ ప్రాజెక్టుగా జీహెచ్ఎంసీ పరిధిలో

'వాటర్, కరెంట్, ప్రాపర్టీ ట్యాక్స్‌ల కామన్ బిల్' విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించిన ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా జీహెచ్ఎంసీ ఏరియాను ఎంపిక చేసింది. గ్రేటర్ హైదరాబాద్‌లో 19.40 లక్షల ప్రాపర్టీ ట్యాక్స్ అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఇంకా ట్యాక్స్ నెట్‌వర్క్ పరిధిలోని బిల్డింగ్స్ లక్షల్లో ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. అయితే, జీహెచ్ఎంసీకి రెసిడెన్షియల్ కేటగిరిలో ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లిస్తున్న భవన యజమానులు వాటర్ బిల్లు, కరెంట్ బిల్లును కమర్షియల్ కేటగిరిలో చెల్లిస్తున్నారని గుర్తించారు. విద్యుత్ శాఖ నుంచి కమర్షియల్ కరెంట్ మీటర్లను వినియోగిస్తూ, జీహెచ్ఎంసీకి రెసిడెన్షియల్ పన్ను చెల్లిస్తున్న సుమారు 93 వేల ప్రాపర్టీలను గుర్తించారు. వీటిని కమర్షియల్ ట్యాక్స్ పరిధిలోకి తీసుకురాడంతో పాటు టాక్స్ పరిధిలోని మరో 70 వేల భవనాలున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటి నుంచే రూ. 600 కోట్ల వరకు ట్యాక్స్ వసూలవుతుందని అధికారుల అంచనా. 360 డిగ్రీల కోణంలో రూ.3వేల కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. జీహెచ్ఎంసీలో వచ్చే ఫలితాల ఆధారంగా 'కామన్ బిల్' విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా తీసుకురానున్నట్టు అధికారులు చెబుతున్నారు.

### మొబైల్ నెంబర్ల లింకప్ సర్వే షురూ

'కామన్ బిల్' కోసం జీహెచ్ఎంసీ బిల్ కలెక్టర్లు, టీజీఎస్పీడీసీఎల్ మీటర్ రీడర్లు సంయుక్తంగా నిర్వహించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ సర్క్యులర్ జారీచేశారు. సోమవారం నుంచి సర్వే ప్రారంభం అని అధికారులు చెబుతున్నారు. ఈనెల 15వ తేదీ వరకు విద్యుత్ వినియోగదారుల మొబైల్ నెంబర్లను, జీహెచ్ఎంసీ ప్రాపర్టీ టాక్స్ ఐడెంటిఫికేషన్ నెంబర్ (పీటీఐఎన్)తో అనుసంధానం చేయాలని గడువు విధించారు. మొబైల్ నెంబర్ల మ్యాపింగ్ బాధ్యతను సర్కిల్ డిప్యూటీ కమిషనర్లకు అప్పగించారు. క్షేత్రస్థాయిలో సిబ్బందిని సమన్వయం చేసుకోవాలని, గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. టెక్నాలజీని వాడి వసూళ్లను కచ్చితంగా రాబట్టాలన్నదే ప్రధాన ఉద్దేశం.

# నిరుద్యోగులకు టీజీపీఎస్సీ అలర్ట్

మొదటి పేజీ తరువాయి

ఈ నిర్ణయం తీసుకున్నారు.

### అప్‌డేట్ చేయకుంటే దరఖాస్తుకు నో ఛాన్స్

ఓటీఆర్ వివరాలను అప్‌డేట్ చేసుకోని అభ్యర్థులు భవిష్యత్తులో వెలువడే ఏ కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లకూ దరఖాస్తు చేసుకోవడానికి వీలుండదని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. అభ్యర్థుల వ్యక్తిగత వివరాలు, విద్యార్హతలు, కేటగిరీ సమాచారం ఖచ్చితంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ ప్రక్రియను చేపట్టినట్లు వెల్లడించారు.

### సవరణలకు ప్రధాన కారణాలివే:

- ఎస్సీ వర్గీకరణ: ఇటీవల జరిగిన ఎస్సీ వర్గీకరణ మార్పుల నేపథ్యంలో కేటగిరీ వివరాల సవరణ.
- విద్యార్హతలు: అభ్యర్థులు కొత్తగా సాధించిన అదనపు విద్యార్హతలను చేర్చుకునే అవకాశం.
- సాంకేతిక సవరణలు: అప్లికేషన్లు, ఫలితాలు మరియు తుది ఎంపిక ప్రక్రియలో ఎలాంటి తప్పులు దొర్లకుండా డేటాబేస్‌ను సిద్ధం చేయడం.

### అభ్యర్థులు పాటించాల్సిన సూచనలు:

- సర్టిఫికెట్లు: విద్యార్హతలకు సంబంధించిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను సిద్ధంగా ఉంచుకోవాలి.
- ఫోటో: కొత్త కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలి.
- వెబ్‌సైట్: అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ https://www.tgpsc.gov.in ద్వారా తమ వివరాలను సరిచూసుకోవాలి.
- ముఖ్య గమనిక: భవిష్యత్తులో వచ్చే అన్ని నోటిఫికేషన్లు కేవలం ఓటీఆర్ డేటా ఆధారంగానే ప్రాసెస్ చేయబడతాయి. కాబట్టి అభ్యర్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే తమ డేటాను అప్‌డేట్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

# చట్టాలు పాటించకుంటే "దేశం విడిచి వెళ్ళండి"

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): దిగ్గజ టెక్ సంస్థ మెటాపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. భారత చట్టాలను పాటించకపోతే దేశం విడిచి వెళ్లిపోవచ్చంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. వాట్సాప్ గోప్యతా విధానంపై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా వాట్సాప్ మాతృసంస్థ మెటాను సీజేఐ జస్టిస్ సూర్యాకాంత్ తీవ్రంగా హెచ్చరించారు. మా దేశ ప్రజల గోప్యతతో మీరు ఆటలాడలేరు. మా డేటాలో సింగిల్ డిజిట్ కూడా పంచుకునేందుకు మేము అనుమతించమని స్పష్టం చేశారు. భారత చట్టాలను పాటించడం ఇష్టం లేకపోతే ఈ దేశం విడిచిపెట్టవచ్చని సీరియస్ కామెంట్స్ చేశారు.

### కేసు నేపథ్యం:

వాట్సాప్ 2021 గోప్యతా విధాన నవీకరణను పరిశీలిస్తూ కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా నవంబర్ 2024లో జారీ చేసిన ఉత్తర్వుల నుండి ఈ వివాదం తలెత్తింది. మార్కెట్‌లో తన ఆధిపత్యాన్ని ఉపయోగించి వినియోగదారులను కొత్త గోప్యతా విధానాన్ని తప్పనిసరిగా అంగీకరించేలా వాట్సాప్ ఒత్తిడి తీసుకువచ్చిందని సీసీఐ పేర్కొంది. వాట్సాప్ మెసేజింగ్ సేవలను కొనసాగించాలంటే మెటా ఇతర ప్లాట్‌ఫార్మ్‌లతో డేటా పంచుకోవడానికి అనుమతి ఇవ్వాల్సిందేనని వినియోగదారులకు తెలిపిందని సీసీఐ ఆక్షేపించింది. ఈ చర్య పోటీ చట్టానికి విరుద్ధమని భావించి రూ.213 కోట్ల జరిమానా విధిస్తూ ఆదేశించింది. ఈ ఉత్తర్వును మెటా, వాట్సాప్ 2025 జనవరిలో సుప్రీంకోర్టులో సవాలు చేశాయి. 2025 నవంబర్‌లో న్యాయ ట్రైబ్యునల్ వాట్సాప్ డేటా షేరింగ్‌పై ఐదేళ్ల నిషేధాన్ని రద్దు చేసింది. అయితే రూ.213 కోట్ల జరిమానాను మాత్రం యథాతథంగా ఉంచింది. తాజాగా మంగళవారం విచారణ జరిపిన ధర్మాసనం మెటా తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది.

# ఎమ్మెల్యేల ఫిరాయింపులపై స్పీకర్ యాక్షన్

### నేడు కడియం శ్రీహరి అనర్హత పిటిషన్‌పై విచారణ

హైదరాబాద్, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనర్హత పిటిషన్‌పై ఈరోజు ఉదయం 11 గంటలకు అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో విచారణ జరగనుంది. ఈ మేరకు విచారణ షెడ్యూల్‌ను స్పీకర్ ప్రసాద్ కుమార్, కడియం శ్రీహరికి మరోసారి పంపిన నోటీసులలో స్పష్టంగా పేర్కొన్నారు. విచారణకు హాజరుకావాలని అసెంబ్లీ సెక్రటరీ నుంచి కడియంకు నోటీసులు కూడా అయ్యాయి. అదేవిధంగా, అనర్హత పిటిషన్ దాఖలు చేసిన కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద కూడా విచారణకు హాజరు కావాలని నోటీసులు పంపారు. మొదట స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే వివేకానంద వాదనలను నమోదు చేయనున్నట్లుగా తెలుస్తోంది. కాగా, 2025 నవంబర్ 20న స్పీకర్ ప్రసాద్ కుమార్ కడియం శ్రీహరితో పాటు దానం నాగేందర్‌కు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. తన నోటీసులకు తక్షణమే అఫిడవిట్ దాఖలు చేయాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. కానీ, కడియం తనకు వచ్చిన నోటీసులపై సమాధానం ఇచ్చేందుకు మరికొంత సమయం కావాలని స్పీకర్‌ను అభ్యర్థిస్తూ లేఖ రాశారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికకు లైన్ క్లియర్

మొదటి పేజీ తరువాయి



ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు తమ ఉత్తర్వులు అడ్డంకిగా లేవని తేల్చి చెప్పింది. గతేడాది ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పామని, కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని పేర్కొంది. తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులు ఎత్తివేయాలని మాజీ ఎమ్మెల్సీ అమిర్ అలీ ఖాన్ సుప్రీంకోర్టులో వెకేట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇవాళ విక్రంనాథ్ ధర్మాసనం విచారణ జరిపింది. అమిర్ అలీ పిటిషన్ ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్ తో జత చేస్తూ ఆదేశాలు ఇస్తూ తదుపరి విచారణ మార్చి 19కి వాయిదా వేసింది.

## మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన పోరిక రాహుల్ నాయక్



ములుగు, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ములుగు జిల్లా కేంద్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన రాష్ట్ర గిరిజన బంజారా నాయకులు పోరిక రాహుల్ నాయక్, బీసీ సెల్ యూత్ నాయకులు నాగరాజు మంత్రి సీతక్క వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు పార్టీలో వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు వంగ రవి యాదవ్,మాజీ జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ రియాజ్ మీర్జా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సమ్మయ్య,మైనారిటీ నాయకులు కుతుబుద్ధిన్,యూత్ నాయకులు ప్రశాంత్,రాకేష్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు

## సఖి భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ డా. సత్య శారద**



వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): వరంగల్ ఆటోనగర్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న వన్ స్టాప్ సఖి భవన నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ నిర్మాణంలో ఉన్న సఖి భవనాన్ని పరిశీలించి పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. భవన నిర్మాణానికి అవసరమైన అదనపు నిధుల కోసం వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సఖి భవనానికి అనుబంధంగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని వెంటనే డిమార్కేషన్ చేయాలని స్థానిక తహశీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. సఖి కేంద్రం ద్వారా మహిళలకు సమగ్ర సేవలు అందే విధంగా మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, తహశీల్దార్ శ్రీకాంత్, సఖి కేంద్ర నిర్వాహకులు శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## స్లాట్ బుకింగ్ చేసుకున్న దివ్యాంగులు సదరం క్యాంపుకు హాజరుకావాలి

జనగాం జిల్లా, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): జనగాం జిల్లాలోని వివిధ రకాల వికలాంగులు కొత్త వారు, రెన్యూవల్ వారు మీ సేవలో యూడిఐడి వెబ్సైట్ లో స్లాట్ బుకింగ్ చేసుకున్న వారు రసీదులో ఉన్న ఫోన్ నెంబర్ కు మెసేజ్ వచ్చిన తేదీలలో జనగామ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సదరం శిబిరానికి హాజరుకావాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిణి వసంత కోరారు. ఈనెల 6వ తేదీ నుండి కొనసాగే ఈ శిబిరం 6, 9, 11, 18, 19, 23, 27వ తేదీలలో ఆర్థో, దృష్టి , వినికిడి లోపం, మానసిక, తలసేమియా, క్రానిక్ న్యూరాలజీ, సంబంధిత వికలాంగులకు డాక్టర్ లచే క్యాంపులు నిర్వహించబడు తుందన్నారు. కొత్తవి 225 ఉండగా, రెన్యూవల్ 65 ఉన్నాయని మొత్తంగా 290 మందికి అవకాశం ఉన్నదన్నారు. యుడిఐడి సదరం స్లాట్ బుకింగ్ కు మీ సేవ లో రూ.35 లు మాత్రమే చెల్లించాలని, సదరం సర్టిఫికెట్ లో 40 శాతం కన్నా తక్కువగా ఉండి రిజెక్ట్ అయిన వికలాంగులు మీ సేవలో యుడిఐడి వెబ్సైట్లో కొత్తగా నమోదు చేసుకునే అవకాశం ఉన్నదన్నారు. ఫోన్ కు మెసేజ్ వచ్చినవారు డాక్టర్ రిపోర్టులతో ఆధార్ కార్డు ఫోటో మీసేవ రసీదు తో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో ఏర్పాటు చేసిన శిబిరానికి హాజరు కాగలరని తెలియజేశారు.ఇతర వివరాలకు సెల్ నెంబర్ 8008202287 ను సంప్రదించాలన్నారు

## కలెక్టర్‌కు గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానం



ములుగు జిల్లా, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): మేడారం మహా జాతరలో గద్దెల పునర్నిర్మాణంలో అహర్నిశలు శ్రమించి అక్కడే ఉంటూ పనులు పర్యవేక్షించి మేడారం జాతరను విజయవంతం చేసిన కలెక్టర్ దివాకర్ టిఎస్ ఐఏఎస్ ని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఘనంగా సన్మానించడం జరిగింది. వారికి అసోసియేషన్ డైరీ అందజేశారు, వరకు బాటు అడిషనల్ కలెక్టర్ మహేందర్ జి మరియు రెవెన్యూ అధికారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం సంపత్ రావు సెక్రెటరీ జీవన్ కుమార్, ట్రెజరర్ ప్రకాష్ రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ కొమురయ్య మరియు సంఘ నాయకులు ఏం రాజు బి శ్రీనివాస్ లక్ష్మణ్ నాయక్, యశ్వంత్, విజయభాస్కర్ శైలజ రఫీక్ దుర్గారావు శంకర్ రాజేశ్వరరావు డిరాజు బి బాలయ్య టి సారంగపాణి జి రాజ్ కుమార్ మాధవి శీతల్ సునీత సందీప్ రహీం అహ్మద్ దేవేంద్రరావు మొదలగు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాలు మరింత మెరుగ్గా ఉండాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): పదో తరగతి విద్యార్థులు విద్యా ప్రగతిలో మరింత మెరుగ్గా ఉండేవిధంగా ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్యా బోధన సాగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం మల్లక్ పల్లి, నారాయణగిరి లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మల్లక్ పల్లి లోని ఉన్నత పాఠశాలలోని పదో తరగతిని కలెక్టర్ సందర్శించారు. డిజిటల్ విధానంలో కొనసాగుతున్న తరగతిలో పాఠ్యాంశాల బోధన గురించి కలెక్టర్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాల పరిసరాలు, పరిశుభ్రతను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు నిర్వహించిన స్లిప్ టెస్ట్ ల గురించి ఆరా తీశారు. పాఠశాలకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రధానోపాధ్యాయురాలు నాగేశ్వరిని కలెక్టర్ అడిగారు. రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడం, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం, విద్యా ప్రమాణాలు తక్కువగా ఉండడం పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసి సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలకు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని అక్కడే ఉన్న డీఈవో ఎల్ వి గిరిరాజ్ గౌడ్ ను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలకు చెందిన నాలుగు, ఐదు తరగతులను నిర్వహిస్తున్న తరగతి గదిని కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. వంటగదిని కలెక్టర్ పరిశీలించారు. ఈ రోజు మెనూ ఏంటి, ఏం వండారు, ఎంతమంది విద్యార్థులకు వంట చేశారు అని మధ్యాహ్న భోజనం వండిన నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా అని కలెక్టర్ ఆరా తీశారు. అదేవిధంగా ఇదే మండలంలోని నారాయణగిరి లో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి బాలికలు, బాలుర సెక్షన్లను జిల్లా కలెక్టర్ సందర్శించారు. బాలికల తరగతిలో నేచురల్ రిసోర్సెస్( సహజ వనరులు) అనే పాఠ్యాంశ బోధన సాగుతుండగా విద్యార్థినులను పాఠ్యాంశానికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల చేత పాఠ్యాంశాన్ని చదివించారు. విద్యార్థినులకు అప్పటికప్పుడే నేచురల్ రిసోర్సెస్ ఏంటి అనే ప్రశ్నకు జవాబులు రాయాలని చెప్పగా విద్యార్థినిలు సమాధానాలు రాశారు. విద్యార్థినులు రాసిన సమాధానాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పదో తరగతి బాలుర సెక్షన్ ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అదేవిధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ డాక్టర్ బి. రాంధన్, ఉపాధ్యాయులతో పాఠ్యాంశాలు, విద్యార్థుల ప్రగతి సంబంధించిన అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఉపాధ్యాయుల డైరీని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు ఏ విధంగా రివిజన్ చేయిస్తున్నారని ఉపాధ్యాయులను కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు బాగుండటంతో పాటు , పదో తరగతి బాలికలు విద్యా ప్రగతి పై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులను చదువులో మరింత మెరుగుపరచాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాల పునశ్చరణ (రివిజన్) చేయించాలన్నారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డీఈవో గిరిరాజ్ గౌడ్, ఎంఈవో డాక్టర్ బి.రాంధన్ , తహసిల్దార్ గుత్తికొండ సదానందం, ఎంపీడీవో కమటం అనిల్ కుమార్, మల్లకపల్లి, నారాయణగిరి గ్రామాల సర్పంచులు గిన్నారపు లత, పుట్ట రేణుక, తదితరులు పాల్గొన్నారు.




## ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ వార్షిక ప్రయోగ పరీక్షలను పకడ్బందీగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు సజావుగా కొనసాగుతున్న నేపథ్యంలో మంగళవారం ఆయన ములకలపల్లి, అశ్వరావుపేట మండలాల్లోని పలు జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ములకలపల్లి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి ప్రయోగ పరీక్షల నిర్వహణ విధానం, ప్రయోగశాలల ఏర్పాట్లు, విద్యార్థుల హాజరు నమోదు, ప్రశ్నపత్రాల భద్రత తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం అశ్వరావుపేట మండలంలోని ఒక ప్రైవేట్ జూనియర్ కళాశాలను కూడా తనిఖీ చేసి పరీక్షలు నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారా లేదా అన్న విషయాన్ని పరిశీలించారు. రెండవ రోజు నిర్వహించిన ప్రయోగ పరీక్షల హాజరు వివరాలను సమీక్షించిన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, ఉదయం నిర్వహించిన పరీక్షలలో సాధారణ విభాగానికి కేటాయించిన 1,295 మందిలో 1,263 మంది హాజరుకాగా 32 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వృత్తి విద్య విభాగానికి కేటాయించిన 1,386 మందిలో 1,207 మంది హాజరుకాగా 179 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. మొత్తం ఉదయం జరిగిన పరీక్షలకు 2,681 మందికి గాను 2,470 మంది హాజరై 211 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలలో సాధారణ విభాగానికి కేటాయించిన 880 మందిలో 861 మంది హాజరుకాగా 19 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వృత్తి విద్య విభాగానికి కేటాయించిన 1,365 మందిలో 1,308 మంది హాజరుకాగా 58 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. మొత్తం మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 2,245 మందికి గాను 2,169 మంది హాజరై 77 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ, ప్రయోగ పరీక్షలు పూర్తయ్యే వరకు అన్ని పరీక్ష కేంద్రాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని కళాశాల యాజమాన్యాలను ఆయన ఆదేశించారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డీ ఎం అండ్ హెచ్ ఓ తనిఖీ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ జిల్లాలోని జగన్నాథపురం ఎంపీ బంజర మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆశా డే సందర్భంగా తనిఖీ చేయడం జరిగినది. జగన్నాథపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు గ్రామ ప్రజలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బిల్డింగ్ శాశ్వత నిర్మాణం గురించి మాట్లాడడం జరిగినది. ఆషాడే సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ జిల్లాలో గర్భిణీ స్త్రీల రిజిస్ట్రేషన్ నమోదు మరియు ప్రభుత్వఆసుపత్రిలో కాన్పులు జరిపించాలని, సిజేరియన్లకు తావివ్వకూడాదు. గర్భిణీలను నమోదు చేసినప్పటి నుంచి కాన్పు అయ్యేంతవరకు వారిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలి, ప్రత్యేకంగా గుత్తి కోయ హ్యాబిటేషన్లలో ఈ కార్యక్రమాలు పటిష్టంగా చేపట్టాలి. రికార్డులు సక్రమంగా నిర్వహించాలి. ఎం సి హెచ్ కార్డులు అర్హులందరికీ అందజేయాలని రక్తహీనత రాకుండా వారికి ఐరన్ మాత్రలు ఎప్పటికప్పుడు ఇస్తూ అవసరమైన వారిని ప్రభుత్వాసుపత్రికి తీసుకుని వెళ్లి వారికి రక్తం ఎక్కించాలని తెలియజేశారు అదే విధంగా గర్భిణీ స్త్రీలకు తల్లులకు విహెచ్ఎన్ డి నిర్వహించినప్పుడు వారికి తల్లిపాల ప్రాముఖ్యత మరియు వ్యాధి నిరోధక టీకాలు వ్యక్తిగత శుభ్రత చేతుల శుభ్రత గురించి కుటుంబ నియంత్రణ గురించి కచ్చితంగా తెలియజేయాలని సూచించారు జిల్లాలో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరుగుతున్న లెప్రసీ నిర్మూలన కార్యక్రమంలో విజయవంతం చేయాలని మరియు ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమంను కూడాపటిష్టంగా నిర్వహించాలని సూచించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించకూడదని కాలేజీలలో మరియు పాఠశాలలలో సమావేశాలను నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని, ఆశలకు మరియు ఏఎన్ఎం లకు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ఆశాడే నందు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సూపర్వైజర్లు ఆరోగ్య కార్యకర్తలు మరియు ఆశలు పాల్గొన్నారు.

# అధైర్య పడొద్దు.. వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే

**మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి**



భూపాలపల్లి, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): బిఆర్ఎస్ పార్టీ నుండి కౌన్సిలర్ టికెట్ ఆశించినప్పటికీ పరిస్థితుల దృష్ట్యా టికెట్ రాని ఆశావాహులు అధైర్యపడవద్దని, భవిష్యత్తులో అందరికీ అండగా ఉంటానని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి భరోసా ఇచ్చారు. ఈ రోజు భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, ఎమ్మెల్సీ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి బండ ప్రకాష్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులకు బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించి, బీ--ఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ ఆశించిన ప్రతి ఒక్కరికి టికెట్ రావడం సాధ్యం కాదని, సెలెక్ట్ అండ్ ఎలెక్ట్ విధానంలో అభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు. టికెట్ రాని వారికి భవిష్యత్తులో పార్టీ నిర్మాణంలో, నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ నిర్మాణ సంస్థాగత ఎన్నికల్లో ప్రతి ఒక్కరికి అవకాశం కల్పిస్తామన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ఒక తల్లి బిడ్డలాంటిదని, అంతర్గత విభేదాలు పక్కనపెట్టి ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. బలహీన వర్గాలకు న్యాయం చేసింది బీఆర్ఎస్ పార్టీయేనని, బీసీలకు 52 శాతం టికెట్లు ఇచ్చామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బీసీల వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. ఆత్మగౌరవ భవనాలకు టిఆర్ఎస్ ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. భూపాలపల్లిలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను కైవసం చేసుకుని గులాబీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కుల సంఘాల ఆత్మగౌరవ భవనాలకు భూములు కేటాయించి రూ.100 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ నిధులను దారి మళ్లించిందని ఆరోపించారు. పార్టీ శ్రేణులతో చర్చించి, సర్వేల ఆధారంగానే అభ్యర్థులను ప్రకటించామని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, రైతుబంధు విషయంలో రైతులను మోసం చేసిందని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. అదే విధంగా గండ్ర జ్యోతి గారు మాట్లాడుతూ భూపాలపల్లి మున్సిపాలిటీలో ఇప్పటికే రెండు సార్లు గెలిచామని, మూడోసారి కూడా హ్యాట్రిక్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని, కాంగ్రెస్ పాలనపై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. భూపాలపల్లి సమగ్ర అభివృద్ధికి పాటుపడిన బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్ధన్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్ యాదవ్, మాజీ వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ నూనె రాజు, బీఆర్ఎస్ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎన్నికల సాధారణ పరిశీలకులు



మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): జిల్లా వ్యాప్తంగా (5) మున్సిపల్ పరిధిలోని మహబూబాబాద్, కేసముద్రం, తొర్రూరు, డోర్నకల్, మరిపెడ లలో నిర్వహిస్తున్న మున్సిపల్ ఎన్నికల ప్రక్రియన ఏర్పాట్లను మంగళవారం మరిపెడ మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం, సెంట్ అగస్టిన్ హై స్కూల్ కౌంటింగ్ కేంద్రంను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ సూచించిన ప్రకారం అధికారులు పక్కాగా సౌకర్యాలను కల్పించాలని, ఎన్నికల ప్రక్రియ ప్రారంభం ముగిసే వరకు రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు త్రాగునీరు, చైర్స్, టెంట్స్, దివ్యాంగుల కోసం వీల్ చైర్స్, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వైద్య బృందం ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం కౌంటింగ్ కేంద్రానికి తరలించే క్రమంలో రిటర్నింగ్ అధికారులు పోలీస్ భద్రతా సిబ్బంది మధ్య పోలింగ్ బాక్సులు తరలించాలని, అభ్యర్థులకు సంబంధించి ప్రచార ముందస్తు అనుమతులు, ఖర్చుల వివరాలు, తదితర అనుమతులను సమయం లోగా తీసుకునే విధంగా అభ్యర్థులకు విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. మరిపెడ కేంద్రంలోనీ సెంట్ ఆగస్టిన్ హైస్కూల్లో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు, కౌంటింగ్ సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారూ. జనరల్ అబ్జర్వర్ వెంట నోడల్ ఆఫీసర్ కృష్ణవేణి, స్థానిక మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్ సంబంధిత ఎన్నికల విభాగం సిబ్బంది కృష్ణ ప్రసాద్, ప్రవీణ్ ఉన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్, బిజెపి నాయకులు



పరకాల, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి –కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుందాం, పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని పరకాల మున్సిపాలిటీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతుందని, పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు బిఆర్ఎస్ అధ్యక్షులు సాధు సర్వేశం, 9వ వార్డు మహిళ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు దాసరి పద్మ, బిఆర్ఎస్ జనరల్ సెక్రెటరీ దాసరి రమేష్ బీజేపీ సీనియర్ నాయకులు గాజుల రంజిత్, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుకునకు కృషి చేయాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పరకాల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం అని,పరకాల పట్టణ అభివృద్ధి దిశగా టిఆర్ఎస్, బిజెపి నాయకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో 9వ వార్డు చెర్ల పరమేశ్వర్, బీజేపీ సీనియర్ నాయకులు గాజుల రంజిత్ పొన్నం శ్రీను, పగిండ్ల భాస్కర్ బిఆర్ఎస్ నాయకులు కనుకుంట్ల రాజేష్, సాదు భరత్, తదితరులు పాల్గొన్నారు.

# టీఆర్పీ అభ్యర్థులకు బీ-ఫారాలు



భూపాలపల్లి, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఐదు వార్డులకు గాను తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేయడం జరిగింది. తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆదేశాలు, రాష్ట్ర కమిటీ మార్గదర్శకాల మేరకు టీఆర్పీ పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఐదుగురు అభ్యర్థులకు అధికారికంగా బీ-ఫారాలు అందజేసి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

**అభ్యర్థుల వివరాలు:**

1) భూపాలపల్లి మున్సిపాలిటీ 10 వ వార్డ్ అభ్యర్థి అవధూత కవిత
2) భూపాలపల్లి మున్సిపాలిటీ 18 వ వార్డు అభ్యర్థిగా గాజ వేణుగోపాల్
3) భూపాలపల్లి మునిసిపాలిటీ 22 వ వార్డు అభ్యర్థిగా కౌటం సౌమ్య
4) భూపాలపల్లి మున్సిపాలిటీ 28 వ వార్డ్ అభ్యర్థిగా ఇనుగాల ప్రణయ్ రాజ్
5) భూపాలపల్లి మున్సిపాలిటీ 29 వ వార్డు అభ్యర్థిగా మామిడి శ్రీకాంత్

ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ, తెలంగాణలో బహుజనుల ఆశలు, ఆకాంక్షలకు ప్రతినిధిగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిలబడుతోందని తెలిపారు. గతంలో ఎన్నికలు వచ్చినప్పుడు ఇతర పార్టీల కార్యాలయాల ముందు బ్రతిమిలాడే పరిస్థితి ఉండేదని, నేడు మన పార్టీ నుంచే మన బహుజన అభ్యర్థులకు బీ-ఫారాలు ఇవ్వడం గర్వకారణమని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన టీఆర్పీ పార్టీ అభ్యర్థులను ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి కోసం టీఆర్పీ పార్టీ అభ్యర్థులు ప్రజల పక్షాన నిలబడి నిజాయితీగా పనిచేస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు ఎస్ పి కే సాగర్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుగాల ప్రణయ్ రాజ్ జిల్లా నాయకులు సంతోష్ శ్రీకాంత్ సిద్దు జస్వంత్ కోటేష్ నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# సీఎం సభ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కల్లెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): 8వ తేదీన చెల్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో (రామప్ప కాలనీ ఎదురుగా) సీఎం సభ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కల్లెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఎస్పి సంకీర్త్ తో కలిసి 8వ తేదీన చెల్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రామప్ప కాలనీ ఎదురుగా ఉన్న స్థలంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సంకీర్త్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సభా స్థలం, వీఐపీ గ్యాలరీ, ప్రజల కోసం ఏర్పాటు చేయనున్న గ్యాలరీ, పార్కింగ్, రహదారి సౌకర్యాలు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, అగ్నిమాపక ఏర్పాట్లు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా, సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ, భద్రతా పరంగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ హరికృష్ణ, ఆర్ అండ్ బి ఈఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆహార తనిఖీ అధికారులు తనిఖీలు నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): జిల్లాలో ఆహార కల్తీని కట్టడి చేసి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఆహార తనిఖీ అధికారులు నిరంతర తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో ఆహార తనిఖీ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ, వైద్య, విద్యా, పంచాయతి రాజ్,సంక్షేమ శాఖల అధికారులతో జిల్లా స్థాయి ఆహార భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా సంస్థలు, వసతి గృహాలు, హోటళ్ళు, భోజనశాలలు తదితర ప్రాంతాల్లో ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టాలని సూచించారు. ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఎక్కడా కల్తీ ఆహారం విక్రయించ బడకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తనిఖీల సందర్భంగా తీసిన ఫోటోలను జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూప్‌లో తప్పనిసరిగా పోస్ట్ చేయాలని, తద్వారా పర్యవేక్షణ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. నమూనాలు సేకరించి పరీక్షించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం, అన్ని సంక్షేమ వసతి గృహాల్లో మెనూ తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆహార తనిఖీ అధికారి వరుణ్ రెడ్డి, ఆర్డీఓ హరికృష్ణ, వైద్యాధికారి డా మధుసూదన్, డీఈఓ రాజేందర్, డిపిఓ శ్రీలత, మహదేవపూర్ సీడీపీఓ రాధిక తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధికి దరఖాస్తుల స్వీకరణ

**జిల్లా షెడ్యుల్డ్ కులాల అభివృద్ధి ఆధికారి శ్రీనివాస రావు**

మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): 2026 విద్యా సంవత్సరమునకు గాను తెలంగాణా ప్రభుత్వం విదేశీ విద్యాలయములల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు షెడ్యుల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా నిర్వహించ బడుచున్న "అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పదకము" ద్వారా షెడ్యుల్డ్ కులములకు చెందిన విద్యార్థులకు 20 లక్షలు రూపాయల స్కాలర్ షిప్ అందించుట జరుగుతుందని. యు.యస్.ఎ, యుకె, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, జపాన్, సౌత్ కొరియా న్యూజిలాండ్ విశ్వ విద్యాలయములల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదలగు ప్రొఫెషనల్ కోర్సులల్లో చదవాలనుకుంటున్న యస్సీ విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యుల్డ్ కులాల అభివృద్ధి ఆదికారి కె.శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో తెలిపారు.

**అభ్యర్థుల అర్హతలు:-**

(1) తెలంగాణా చెందిన యస్సీ కులమునకు చెందినవారై ఉండాలి. (2). సం. ఆదాయము 5.00 లక్షలకు మించ కుండ ఉండాలి. (3), పి.జి చదవడానికి పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో మొదటి మార్కులు వచ్చి ఉండాలి.(4). TOEFL/IELTS/GRE/GMAT నందు అర్హత కలిగి ఉండాలి. (5). పాస్ పోర్ట్ నందు విసా అర్హత కలిగి ఉండాలి. (6). విదేశీ విశ్వ విద్యాలయము నందు అడ్మిషన్ పొంది ఉండాలి. (7). ఒక కుటుంబం నుండి ఒక్కరు మాత్రమే ఈ పదకము నకు అర్హులు.

దరఖాస్తు చేసుకునే వారు ఈ పాస్ వెబ్ సైట్లో www.telanganaepass.cgg.gov.in సందర్శించగలరు. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేది: 31-03-2026. కావున అర్హులైన యస్సీ విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని ఈ సందర్భంగా అధికారి పేర్కొన్నారు.

# గంజాయి స్మగ్లర్లను కఠినంగా శిక్షించాలి: డివైఎఫ్ఐ



హనుమకొండ, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): గంజాయి స్మగ్లర్ల దాష్టికానికి అసువులు బాసిన నిజామాబాద్ ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతికి కారణమైన గంజాయి స్మగ్లర్లను కఠినంగా శిక్షించాలని డివైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి డిమాండ్ చేశారు. కానిస్టేబుల్ సౌమ్య మృతికి కారణమైన గంజాయి స్మగ్లర్లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ నక్కల గుట్టలోని కాలోజి విగ్రహం దగ్గర డివైఎఫ్ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. జనవరి 23న గంజాయి సరఫరా చేస్తున్నారన్న సమాచారం మేరకు నిజామాబాద్ శివారులోని మాధవ నగర్ వద్ద ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా ఎక్సైజ్ పోలీసులను చూసిన గంజాయి స్మగ్లింగ్ ముఠా సభ్యులు పారిపోయేందుకు ప్రయత్నించగా ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య వారిని పట్టుకునే ప్రయత్నంలో గంజాయి ముఠా సభ్యుల తమ కారుతో ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను ఢీకొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారని ఎనిమిది రోజులపాటు సౌమ్య ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడి విధి నిర్వహణలో అసాధారణ తెగువ ప్రదర్శించి అసువులు బాసిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పోలీసులకే రక్షణ లేనప్పుడు సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలోని చత్తీస్గడ్ మహారాష్ట్రకు సంబంధించిన గంజాయి డ్రగ్స్ స్మగ్లర్లు తెలంగాణలోకి ప్రవేశిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ యంత్రాంగం ఇప్పటివరకు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గంజాయి డ్రగ్స్ విచ్చలవిడిగా సిటీ నుండి గ్రామాల వరకు విస్తరించిందని రాష్ట్ర ప్రభుత్వం పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు నిగా పెట్టాలని, రెండు నెలల క్రితం చర్లపల్లి లో కెమికల్ కంపెనీ పేరుతో డ్రగ్స్ ను తయారు చేస్తూ విదేశాలకు పంపిస్తున్న పరిస్థితి ఉందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ గంజాయి పై స్పెషల్ వింగ్లను ఏర్పాటు చేసి ఇలాంటి ఘటనలు పృణావతం కాకుండా చర్యలు తీసుకోవాలని. వెంటనే కానిస్టేబుల్ సౌమ్య మృతికి కారణమైన గంజాయి స్మగ్లర్లను కఠినంగా శిక్షించాలని సౌమ్య కుటుంబాన్ని అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు కే.కుమార స్వామి, యం.సతీష్, డివైఎఫ్ఐ నాయకులు జి.గణేష్, కే.మహేందర్, రాజు పాల్గొన్నారు.


# మేడారం జాతర గ్రాండ్ సక్సెస్



హైదరాబాద్, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేడారం జాతర విజయవంతమైందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మంగళవారం సెక్రటేరియట్‌లో విలేకర్లతో మంత్రి సీతక్క ఇష్టాగోష్టిగా మాట్లాడారు. జాతర పనులు, గుడి పనులు సజావుగా జరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. కొంత మంది జాతరతోపాటు ఏర్పాట్లపై విష ప్రచారం చేశారంటూ మండిపడ్డారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర ముగిసిందని పేర్కొన్నారు. ఒక దొంగతనం ఘటనపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని వివరించారు. ఒకట్రెండు రోజుల్లో తిరుగు జాతర జరుగుతుందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఈ జాతర ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారని మంత్రి సీతక్క వివరించారు. క్లాస్, మాస్‌తోపాటు ఉన్నత స్థాయి వర్గాల వారు సైతం ఈ జాతరకు భారీగా తరలివచ్చారని చెప్పారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు ఈ మేడారం జాతరకు వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. వచ్చే జాతర సమయానికి మేడారం పరిసర ప్రాంతాల్లోని రహదారులను వెడల్పు చేసి.. ట్రాఫిక్ జామ్‌లను నివారిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల కోసం ములుగు జిల్లా పరిధిలో పనులపై అధికారులతో సమీక్షిస్తామని ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# తెలంగాణ మున్సిపల్ సమరం

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): మున్సిపల్ ఎన్నికల్లో కీలక ఘట్టం ముగిసింది. నామినేషన్లు ఉపసంహరణకు గడువు ముగిసింది. మంగళవారం సాయంత్రం 3 గంటల వరకూ ఉపసంహరణకు అవకాశం ఇచ్చారు. మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఫిబ్రవరి 11వ తేదీన ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు జరగనున్నాయి. ఎక్కడైనా రీపోలింగ్ నిర్వహించాల్సివస్తే ఫిబ్రవరి 12న నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 13న ఫలితాలు ప్రకటించనున్నారు. ఫిబ్రవరి 16న 116 మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నిక, 7 కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక ఉండనుంది. మట్టత్తం 52,43,000 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికలు పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈసీ అధికారులు తెలిపారు. పోలీస్ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి భద్రత కల్పిస్తామన్నారు. రిటర్నింగ్ అధికారులకు సహకరించాలని పార్టీలను కోరారు. కాగా, ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు ఈ ఎన్నికలు అత్యంత కీలకంగా మారాయి. పట్టణ ఓటర్ల తీర్పు ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.




# పరీక్షల వేళ గురుకుల విద్యార్థులకు సైకలాజికల్ బూస్ట్

**ఒత్తిడిని జయించేలా ప్రత్యేక శిక్షణ**

**స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై ఫోకస్**



హైదరాబాద్, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని ఎస్టీ గురుకులాల్లో ప్రస్తుతం వార్షిక పరీక్షల సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి. పది, ఇంటర్ పరీక్షల కోసం స్టూడెంట్లు ప్రిపేర్ అవుతున్నారు. గురుకుల ఫ్యాకల్టీ సైతం స్టడీ అవర్స్ నిర్వహిస్తోంది. అయితే పరీక్షల సమయంలో విద్యార్థులు భయం, ఒత్తిడి, టెన్షన్ కు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో వారి ఆందోళనను పొగొట్టేందుకు గురుకుల అధికారులు చర్యలు చేపట్టారు. ఎస్టీ గురుకుల సొసైటీ పరిధిలో ఉన్న 181 ఇన్‌స్టిట్యూషన్స్ లో పది, ఇంటర్ చదివే స్టూడెంట్స్ 20 వేల మంది ఉన్నారు. వీరికి అన్ని ఉమ్మడి జిల్లాల్లో ప్రముఖ సైకాలజిస్టులను నియమించి గత 3 రోజులుగా సైకాలజీ క్లాసులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 9 వేల మందికి సైకాలజీ క్లాసులు పూర్తి చేశారు. స్ట్రెస్ మేనేజ్ మెంట్, టైమ్ మేనేజ్ మెంట్, రిలాక్సేషన్, పాజిటివ్ థింకింగ్, స్టడీ ప్లానింగ్ వంటి అంశాలపై క్లాసులు నిర్వహిస్తున్నారు. ఈనెల మొత్తం క్లాసులు నిర్వహిస్తామని ఎస్టీ గురుకుల సొసైటీ అధికారులు చెబుతున్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడిని జయించేందుకు సైకాలజిస్టులు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

పరీక్షల సమయంలో సుమారు 40 శాతం మంది విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని, అందరికీ కౌన్సెలింగ్ అవసరమని అధ్యయనాలు చెప్పటంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇలాంటి క్లాసులు ఏటా ఎక్కువ సార్లు నిర్వహించాలని స్టూడెంట్స్ కోరుతున్నారు.

# ఉద్యోగాల హామీపై నయవంచన

మొదటి పేజీ తరువాయి



యువతరం ఛీ కొడుతోందని ట్వీట్ చేశారు కేటీఆర్. తొలి సంవత్సరమే రెండు లక్షల నియామకాలు చేపట్టకపోతే ప్రభుత్వాన్ని దించేయండని ఢిల్లీ నుంచి వచ్చి మరీ చెప్పిపోయిన ప్రియాంక మాట అమలై ఉంటే ఈ దగాకోరు సర్కారు కుప్పకూలి ఇప్పటికే ఏడాది పూర్తయ్యేది. కేసీఆర్హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలిచ్చి ఫోటోలకు ఫోజు కొట్టిన సీఎం. ఆ తరువాత మొత్తానికే చేతులెత్తేయడంతోనే తెలంగాణలో రిక్రూట్ మెంట్ జీరోగా మారిపోయింది. అప్పటికే లక్షా 65 వేల ఉద్యోగాలను భర్తీచేసిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై పనిగట్టుకుని రేవంత్ చల్లిన బురద అంతా అబద్ధాలతో అందలం ఎక్కడానికేనని అందరికీ అర్థమైపోయింది. పట్టుమని పదివేల కొత్త ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్లు ఇవ్వని చేతకాని దద్దమ్మ పాలన చూసి నిరుద్యోగులే కాదు, వారి తల్లిదండ్రులు కూడా దుమ్మెత్తి పోస్తున్నారు.

జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును నిత్యం తెలంగాణ సమాజం గమనిస్తూనే ఉంది. రెండు లక్షల ఉద్యోగాల హామీపై నాలుక మడతేసినంత మాత్రాన నాలుగు కోట్ల ప్రజలు ఊరుకుంటారని, ముఖ్యమంత్రి చేసిన మోసాన్ని మరిచిపోతారని అనుకుంటే అది పొరపాటే. తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు ముఖ్యమంత్రి ముక్కునేలకు రాసి క్షమాపణలు చెప్పినా, పొర్లుదండాలు పెట్టినా క్షమించే ప్రసక్తే లేదు. మేధావుల ముసుగు వేసుకుని మాయమాటలతో మభ్యపెట్టిన గొంతులన్నీ గత రెండేళ్లనుంచి మూగబోయినంత మాత్రాన మీరు చేసిన పాపం ఊరికేపోదు. మెగా డీఎస్సీ పేరిట దగా, నిరుద్యోగ భృతి పేరిట చేసిన ద్రోహానికి గుణపాఠం చెప్పేందుకు ఆదిలాబాద్ నుంచి అశోక్ నగర్ చౌరస్తా వరకూ ప్రతి నిరుద్యోగి సిద్ధంగా ఉన్నాడు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారు. కేసీఆర్ గారి పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పులపాలు చేసి తీరని ద్రోహం చేశారు. సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు రూ. 2500 ఇస్తానని చెప్పిన మాటకు రెండేళ్లయినా ఒక్కరికీ దిక్కులేకపోవడంతో ఆడబిడ్డలు కోపంతో రగిలిపోతున్నారు. ఆరు గ్యారెంటీలన్నీ అక్షరాలా గారడీలేనని, 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయం. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తాం' అని కేటీఆర్ తెలిపారు.

# రైతు నేస్తంలో మంత్రి తుమ్మల ముఖాముఖి

హైదరాబాద్, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 'రైతు నేస్తం' కార్యక్రమంలో పాల్గొని రైతులతో ముఖాముఖి ముచ్చటించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు తమ వ్యవసాయ అనుభవాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల వల్ల పొందుతున్న ప్రయోజనాలను మంత్రితో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా యూరియా యాప్ అమలుపై మంత్రి స్వయంగా రైతులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. యాప్ ద్వారా ఎరువుల సరఫరా పారదర్శకంగా, సులభంగా జరుగుతుండటంపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా యూరియా లభ్యత, సమయానికి సరఫరా వంటి అంశాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని వారు తెలిపారు.

**రైతులు చూసేలా ప్రదర్శనలు**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి మంగళవారం నిర్వహించే 'రైతు నేస్తం' కార్యక్రమంలో రైతుల అవసరాల మేరకు అంశాలను ముందుగానే నిర్ణయించాలని అధికారులకు సూచించారు. నిర్ణయించిన అంశాలకు అనుగుణంగా రైతుల అనుభవాలు, విజయగాథలను క్షేత్రస్థాయిలో – పొలాల నుంచే ప్రత్యక్షంగా, ఇతర రైతులు చూసేలా ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

# గ్రూప్-1 పిటిషనర్‌కు బెదిరింపులు

హైదరాబాద్, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): గ్రూప్–1 పరీక్షల్లో అవకతవకలపై న్యాయ పోరాటం చేస్తున్న పిటిషనర్‌కు బెదిరింపులు వస్తున్న వ్యవహారంపై హైకోర్టు స్పందించింది. పిటిషనర్‌కు ఇస్తున్న రక్షణపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2023 గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షలో అవకతవకలపై దాఖలైన వ్యాజ్యంలో హైకోర్టు ఇటీవల సదరు పరీక్షలు రద్దు చేసింది. దీంతో తనకు బెదింపులు వస్తున్నాయంటూ పిటిషనర్ బి.నర్సింగ్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిని జస్టిస్ తుకారాం జీ విచారించారు. పిటిషనర్ న్యాయవాది వాదిస్తూ పిటిషనర్‌కు బెదిరింపులు ఎక్కవ య్యాయని కోర్టుకు చెప్పారు. బెదిరింపులు సోషల్ మీడియాలో వచ్చాయన్నారు. పిటిషనర్‌కు పాణహాని ఉన్నందున రక్షణ కల్పించాలని డీజీపీకి వినతిపత్రం సమర్పించినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. వివరణ ఇచ్చేందుకు సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరడంతో విచారణ ఈ నెల 9కి వాయిదా పడింది.

# సురక్షిత ప్రయాణమే లక్ష్యం

## రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ వెబ్‌సైట్‌ను ప్రారంభించిన మంత్రి పొన్నం




హైదరాబాద్, ఫిబ్రవరి 03 (తీన్మార్ న్యూస్): రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ వెబ్‌సైట్‌ను మంగళవారం సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది తెలంగాణలో బాధ్యతాయుతమైన రహదారి ప్రవర్తన సంస్కృతిని నిర్మించే దిశగా ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుందని అన్నారు. పౌరులు, తల్లిదండ్రులను రోడ్డు భద్రతకు స్పృహతో కట్టుబడి ఉండేలా ప్రోత్సహించడం, ప్రాణాలను రక్షించడం ఉమ్మడి బాధ్యత అని, సురక్షితమైన అలవాట్లు ఇంట్లోనే ప్రారంభమై ప్రతి రహదారిపై కొనసాగుతాయని గుర్తించడం రవాణా శాఖ లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు వినియోగదారులలో క్రమశిక్షణ, అవగాహన, బాధ్యతాయుతమైన ప్రవర్తనను ప్రోత్సహించే దార్శనికతను పునరుద్ఘాటించారని తెలిపారు. పౌరులు ట్రాఫిక్ నియమాలను పాటించడానికి, రోడ్డుపై ఉన్న ప్రతి జీవితాన్ని గౌరవించడానికి పౌర ప్రతిజ్ఞను తీసుకోవచ్చన్నారు. తల్లిదండ్రులు తల్లిదండ్రుల ప్రతిజ్ఞను ఉదాహరణగా తీసుకొని, పిల్లలలో సురక్షితమైన అలవాట్లను రూపొందించవచ్చన్నారు. ఈ చొరవ రోడ్డు భద్రత అంటే కేవలం అమలు మాత్రమే కాదని, కుటుంబాలు, పిల్లలు, తెలంగాణలోని ప్రతి తోటి పౌరుడికి సమిష్టి వాగ్దానం అని గుర్తు చేస్తుందన్నారు. ఇది రోడ్డు భద్రతకు ప్రభుత్వం బలమైన సంస్థాగత నిబద్ధతను ప్రతిబింబిస్తుందని తెలియజేశారు.

# గోధుమ రోటీలు కాదు.. వీటిని తింటే ఇంకా ఎక్కువ లాభాలు కలుగుతాయి..!



చాలా మంది భారతీయులకు రోటీ అనేది రోజు వారి ఆహారమే అని చెప్పవచ్చు. దాని వల్ల కలిగే మేలు , పోషకాల గురించి ఆలోచించకుండా గోధుమ రోటీలని రోజూ తింటూనే ఉంటారు. గోధుమ రోటీలని ఎక్కువగా తీసుకున్నప్పటికీ ఇవి అందరికీ ఎల్లప్పుడూ మేలు చేస్తాయని చెప్పలేం. గోధుమ రోటీలని ఎక్కువగా తీసుకోవడం వల్ల బరువు పెరగడం, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం, జీర్ణ సమస్యలు, పోషకాహార లోపం వంటి ఇబ్బందులు కూడా కలుగుతాయి. కనుక గోధుమ రోటీలకి బదులుగా తృణ ధాన్యాలు, పప్పు దినుసులు, చిరుధాన్యాలతో చేసిన రోటీలను తీసుకోవాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఈ రోటీలు ఒక్కొక్కటి ఒక్కో రుచిని, ఆరోగ్యప్రయోజనాలను అందిస్తాయని వీటిని తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు. గోధుమ రోటీలకు బదులుగా మనం తీసుకోదగిన ఇతర రోటీలు, వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### సజ్జరోటీ, జొన్న రోటీ, రాగి రోటీ, మక్కీ రోటీ..

మనం గోధుమలకు బదులుగా సజ్జలతో చేసిన రోటీలను కూడా తీసుకోవచ్చు. సజ్జల్లో ఐరన్, మెగ్నీషియం, ఫ్లేవనాయిడ్లు, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ఫైటో న్యూట్రియెంట్లు వంటి పోషకాలు ఉంటాయి. సజ్జ రోటీలను తీసుకోవడం వల్ల రక్తహీనత తగ్గుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీరం బలంగా తయారవుతుంది. గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు ఉన్న వారికి సజ్జ రోటీలు ప్రయోజనకరంగా ఉంటాయి. అలాగే జొన్నల్లో కూడా ఐరన్, క్యాల్షియం, మెగ్నీషియం, ఫైబర్, బి విటమిన్లు వంటి పోషకాలు ఎక్కువగా క్యాలరీలు తక్కువగా ఉంటాయి. ఇవి గ్లూటెన్ రహితమైనవి కనుక గ్లూటెన్ సెన్సిటివిటీ ఉన్నవారికి ఇవి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. జొన్న రొట్టెలను తీసుకోవడం వల్ల బరువు తగ్గవచ్చు. గుండె ఆరోగ్యం, జీర్ణక్రియ మెరుగుపడుతుంది.

ఎముకల ఆరోగ్యానికి రాగులు ఎంతో మేలు చేస్తాయి. వీటిలో అధికంగా ఉండే క్యాల్షియం ఎముకలను దృఢంగా చేయడంలో సహాయపడుతుంది. రాగుల్లో ఫైబర్ కూడా అధికంగా ఉంటుంది కనుక వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. అతిగా తినడం తగ్గిస్తుంది. దీంతో శరీర బరువు అదుపులో ఉంటుంది. రాగి రోటీలను తీసుకోవడం వల్ల హిమోగ్లోబిన్ స్థాయిలు పెరగడంతో పాటు శరీరం దృఢంగా తయారవుతుంది. అదే విధంగా గోధుమరోటీలకు బదులుగా మనం మొక్కజొన్నతో కూడా రోటీలను తయారు చేసి తీసుకోవచ్చు. వీటిలో విటమిన్ ఎ ఎక్కువగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల త్వరగా శక్తి లభిస్తుంది. అయితే వీటిని మితంగా తీసుకోవాలి. ఎక్కువగా తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

### బియ్యం రోటీ, బేసన్ రోటీ, ఓట్స్ రోటీ..

ఇక సున్నితమైన జీర్ణక్రియ ఉన్నవారు బియ్యం రోటీలను తీసుకోవచ్చు. ఇవి సులభంగా జీర్ణమవుతాయి. పొట్టకు తేలికగా ఉంటాయి. బేసన్ రోటీలో ప్రోటీన్, ఫైబర్ అధికంగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల కండరాల ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలిగి చిరుతిండి తినాలనే కోరిక తగ్గుతుంది. తద్వారా బరువు తగ్గుతారు. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో ఓట్స్ మనకు ఎంతో సహాయపడతాయి. ఓట్స్ తో రోటీలను తయారు చేసి తీసుకోవడం వల్ల శరీర బరువు అదుపులో ఉంటుంది. పేగుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈ విధంగా మనం గోధుమ రోటీలకు బదులుగా ఇతర ధాన్యాలతో చేసిన రోటీలను కూడా తీసుకోవచ్చని వీటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

# నెల రోజుల పాటు చక్కెర తినడం మానేస్తే.. ఏం జరుగుతుందో తెలుసా..?

మనం తీసుకునే ఆహారంలో చక్కెర ఒక భాగమైనదని చెప్పవచ్చు. ఉదయం నిద్రలేచింది మొదలు సాయంత్రం నిద్రించే వరకు ఏదో ఒక రూపంలో చక్కెరను తీసుకుంటూనే ఉంటాం. టీ, కాఫీ, జ్యూస్, స్వీట్స్, కుకీస్ ఇలా ఏదో ఒక రూపంలో చక్కెర మన శరీరంలోకి వెళ్తూనే ఉంటుంది. అయితే చక్కెరను తీసుకోవడం 30 రోజుల పాటు మానేయడం వల్ల మనం అనేక శారీరక, మానసిక మార్పులను గమనించవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే చక్కెరను మానేసిన తరువాత మొదట్లో మనం కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. చక్కెరను తీసుకోవడం మానేసిన తరువాత చిరాకు, అలసట, ఆందోళన వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. మెదడు చక్కెర అందించే డోపమైన్ హిట్ ను కోల్పోవడం వల్ల ఇలా జరుగుతుంది. చక్కెర తీసుకోవాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. శరీరం నెమ్మదిగా చక్కెరకు దూరం అయ్యే కొద్దీ ఈ కోరికలు తగ్గుతూ వస్తాయి. కొవ్వు కరుగుతుంది..



అయితే డిటాక్స్ ట్రెండ్ కంటే ఎక్కువగా చక్కెరను తీసుకోకపోవడం వల్ల మన శరీరానికి కలిగే మేలే ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇలా చక్కెరను తీసుకోవడం తగ్గించడం వల్ల క్రమంగా రెండవ వారం నాటికి రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. రక్తంలో గ్లూకోజ్ మరింత సమర్థవంతంగా నిర్వహించబడుతుంది. ఇన్సులిన్ స్థాయిలు తగ్గడంతో శరీరం నిల్వ ఉన్న కొవ్వును కరిగించడం ప్రారంభిస్తుంది. తద్వారా శరీర బరువు తగ్గుతుంది. ఇక మూడవ వారం కూడా చక్కెరను తీసుకోవడం మానేయడం వల్ల మనం దీర్ఘకాలిక ప్రయోజనాలనుగమనించవచ్చు. చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. దద్దుర్లు, మంట, మొటిమలు, పగుళ్లు వంటివి తగ్గుతాయి. అకాల వృద్ధాప్యం రాకుండా ఉంటుంది. రక్తంలో చక్కెర క్రాష్ లు తగ్గడం వల్ల మనం మరింత స్థిరంగా దృష్టి కేంద్రీకరించవచ్చు.

### కొలెస్ట్రాల్ అదుపులో..

క్యాలరీలు తీసుకోవడం తగ్గడం వల్ల శరీర బరువు తగ్గడాన్ని మనం ఎక్కువగా గమనించవచ్చు. అంతేకాకుండా అధిక కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్ వంటి కాలేయ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు. ఇక చక్కెర ఉండే స్వీట్లు, పానీయాలు, బేక్ చేసిన వస్తువులు తీసుకోవడం తగ్గించడం వల్ల ప్రజలు పండ్లు, గింజలు వంటి వాటిని తీసుకోవడానికి మొగ్గు చూపుతారు. దీంతో శరీరానికి కావల్సిన పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. చక్కెర కలిగిన ఆహార పదార్థాలకు బదులుగా నానబెట్టిన ఖర్జూరాలు, పెరుగు వంటి వాటిని తీసుకోవడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. పేగు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.




### ఉత్సాహంగా మారుతారు..


అంతేకాకుండా చక్కెరలో వచ్చే హెచ్చుతగ్గులు బద్దకం, చిరాకుకు కారణమవుతాయి. కనుక చక్కెరను మానేయడం వల్ల మనం ఉత్సాహంగా ఉండడంతో పాటు మానసికంగా ఉత్సాహంగా ఉండవచ్చు. ఇలా నెలరోజుల పాటు చక్కెర తీసుకోవడం మానేయడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు. చక్కెర మానేయడం తాత్కాలికంగానే కాకుండా స్థిరమైన జీవనశైలి ఎంపికగాఉండాలని వారు సూచిస్తున్నారు. చక్కెరకు బదులుగా బెల్లం, తేనె, ఖర్జూరం వంటి వాటిని మితంగా తీసుకోవాలి. అలాగే తీపి వంటకాల తయారీలో చక్కెరకు బదులుగా యాలకులు, దాల్చిన చెక్క వంటి వాటిని వాడడం వల్ల తీపి తింటున్నామన్న అనుభూతి పెరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.

# ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా..? అయితే మీకు కిడ్నీ వ్యాధి ఉందని అర్థం..!

మన శరీర ఆరోగ్యాన్ని కాపాడడంలో మూత్రపిండాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. రక్తం నుండి విష పదార్థాలను తొలగించడం, శరీరంలో ద్రవాలను సమతుల్యం చేయడం, సోడియం, పొటాషియం, క్యాల్షియం వంటి ఖనిజాలను నియంత్రించడం వంటి ముఖ్యమైన విధులను మూత్రపిండాలు నిర్వర్తిస్తాయి. కనుక మనం మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో అవసరం. దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధిని ముందుగా గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల సమస్య మరింత తీవ్రతరం కాకుండా కాపాడుకోవచ్చు. గ్లోమెరులర్ వడపోత రేటు, యూరిన్ అల్బుమిన్ టు క్రియాటినైన్ నిష్పత్తి వంటి సాధారణ మూత్రపిండాల పరీక్షలు చేయించుకోవడం వల్ల సమస్యలను ముందుగానే గుర్తించవచ్చు, కోలుకునే సమయం కూడా తక్కువగా ఉంటుంది. మూత్రపిండాల సమస్యలను ముందుగానే గుర్తించడం వల్ల వ్యాధి మరింత తీవ్రతరం కాకుండా అడ్డుకోవచ్చు. దీంతో శరీర ఆరోగ్యం కూడా దెబ్బతినకుండా కాపాడుకోవచ్చు.

### అలసట, బలహీనత..

సకాలంలో చికిత్స తీసుకోవడం వల్ల మూత్రపిండాల వ్యాధిని సమర్థవంతంగా తగ్గించుకోవచ్చు. ముందుగా మూత్రపిండాల వ్యాధులను వల్ల గుర్తించడం వల్ల మూత్రపిండాల పనితీరును మెరుగుపరుచుకోవడంతో పాటు మూత్రపిండాల మార్పిడి, డయాలసిస్ వంటి



చికిత్స విధానాలను అరికట్టవచ్చని వైద్యులు చెబుతున్నారు. కనుక మూత్రపిండాల సమస్యలను ముందుగా గుర్తించడం చాలా అవసరమని వారు పేర్కొంటున్నారు. మూత్రపిండాల వ్యాధులను గుర్తించే కొన్ని లక్షణాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. మూత్రపిండాల పనితీరు తగ్గడం వల్ల శరీరంలో విష పదార్థాలు పేరుకుపోతాయి. ఇది క్రమంగా అలసట, బలహీనతకు దారి తీస్తాయి. మూత్రపిండాల వ్యాధులు రక్తహీనతకు కూడా కారణమవుతాయి. దీంతో మరింత అలసటగా ఉంటుంది.

### మూత్ర విసర్జనలో మార్పులు..


మూత్రపిండాల వ్యాధులతో బాధపడే వారిలో మూత్ర విసర్జనలో మార్పులు వస్తాయి. మూత్రపిండాల వ్యాధులను గుర్తించే ప్రారంభ సంకేతాల్లో ఇది ఒకటి. రాత్రి సమయంలో మూత్ర విసర్జన పెరగడం, ముదురు తుప్పు పట్టిన రంగులో మూత్రం రావడం, నురుగుతో కూడిన మూత్రం రావడం, మూత్రంలో రక్తం రావడం వంటి లక్షణాలు కూడా మూత్రపిండాల వ్యాధులను తెలియజేస్తాయి. అంతేకాకుండా మూత్రపిండాల సమస్య కారణంగా శరీరంలో సోడియం పేరుకుపోతుంది. తద్వారా పాదాలు, కాళ్లు, చేతులు, చీలమండలు వాపుకు గురి అవుతాయి. మూత్రపిండాల సమస్యల కారణంగా చర్మం దురద రావడం, కళ్ల చుట్టూ వాపులకు గురైనట్టు ఉండడం కూడా జరుగుతుంది. ఆకలి తగ్గుతుంది. వికారం, వాంతులు, బరువు తగ్గడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. మూత్రపిండాల పనితీరు తగ్గడం వల్ల నరాల పనితీరు తగ్గుతుంది. దీని వల్ల తిమ్మిర్లు వస్తాయి. మూత్రపిండాల సమస్యలు తలెత్తినప్పుడు ఇలా అనేక లక్షణాలను మన శరీరం చూపిస్తుంది. ఈ లక్షణాలను ముందుగా గుర్తించడం వల్ల సమస్య మరింత తీవ్రతరం కాకుండా నిరోధించడంతో పాటు మూత్రపిండాల ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చు.

# భోజనం చేసిన తరువాత యాలకులను తింటే కలిగే అద్భుతమైన లాభాలు ఇవే..!

భోజనాన్ని రుచికరమైన మౌత్ ఫ్రెషర్ తో ముగియడం భారతదేశం పాత సంస్కృతిలో ఒక భాగం. భోజనం చేసిన తరువాత జీర్ణక్రియను మెరుగుపరచడానికి ఇలా చేస్తూ ఉంటారు. మౌత్ ఫ్రెషర్ గా ఎక్కువగా సుగంధ ద్రవ్యాలను ఉపయోగిస్తూ ఉంటారు. మనం మౌత్ ఫ్రెషర్ గా వాడే సుగంధ ద్రవ్యాలల్లో యాలకులు ఒకటి. మౌత్ ఫ్రెషర్ గా వీటిని చాలా తక్కువ మంది వాడతారనే చెప్పవచ్చు. యాలకులు మంచి వాసనతో పాటు ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో లక్షణాలను కలిగి ఉంటాయి. వంటల్లో వీటిని వాడడం వల్ల వంటల రుచి, వాసన పెరుగుతుందని చెప్పవచ్చు. యాలకులను ఆయుర్వేదంలో కూడా ఎంతో కాలంగా ఔషధాల తయారీలో ఉపయోగిస్తున్నారు. భోజనం చేసిన తరువాత యాలకులను నమలడం వల్ల మనకు మేలు కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. భోజనం చేసిన తరువాత యాలకులను నమలడం వల్ల కలిగే మేలు గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### నోటి దుర్వాసనకు చెక్..

భోజనం చేసిన తరువాత యాలకులను నమలడం వల్ల నోటి దుర్వాసన తగ్గుతుంది. ఇందులో ఉండే సుగంధ నూనెలు నోటిలో ఉండే బ్యాక్టీరియాతో పోరాడతాయి. దీంతో నోట్లో దుర్వాసన తగ్గుతుంది. భోజనం చేసిన తరువాత నోటి నుండి ఉల్లిపాయ లేదా వెల్లుల్లి వాసన వస్తూ ఉంటుంది. అలాంటి సమయంలో ఒక యాలక్కాయను నమలడం వల్ల వాసన తగ్గడంతో పాటు నోటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. అలాగే యాలకులలో సినోల్ వంటి సహజ సమ్మేళనాలు, అవసరమయ్యే నూనెలు ఉంటాయి. ఇవి జీర్ణ ఎంజైమ్ లు ఎక్కువగా ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. భోజనం చేసిన తరువాత యాలకులను నమలడం వల్ల తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. గ్యాస్, ఉబ్బరం వంటి



సమస్యలు తగ్గుతాయి. యాలకులను నమలడం వల్ల భారీ భోజనం చేసిన తరువాత వచ్చే అసౌకర్యం, భారం తగ్గుతాయి.

### లివర్, కిడ్నీల ఆరోగ్యానికి..

అదే విధంగా యాలకులల్లో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. వీటితో పాటు కాలేయం, మూత్రపిండాల డిటాక్సిఫికేషన్ ప్రక్రియను ప్రోత్సహించే సమ్మేళనాలు కూడా ఉంటాయి. దీంతో శరీరం నుండి విషపదార్థాలు సులభంగా తొలగిపోతాయి. అంతేకాకుండా యాలకులను నమలడం వల్ల శరీరంలో జీవక్రియల వేగం పెరుగుతుంది. యాలకులు చిన్నగా ఉన్నప్పటికీ వీటిని తీసుకోవడం వల్ల రోజువారి ఆరోగ్యం, జీర్ణ సమతుల్యతను కాపాడడంలో మనకు ఎంతో సహాయపడతాయి. భోజనం చేసిన తరువాత యాలకులను తీసుకోవడం వల్ల భోజనం చేసిన తరువాత తీపి తినాలనే కోరిక తగ్గుతుంది. దీంతో యాలకులు బరువు నియంత్రణకు సహాయక సాధనంగా మారతాయి. ఇలా అనేక రకాలుగా యాలకులు మనకు మేలు చేస్తాయని భోజనం తరువాత వీటిని నమలడం వల్ల నోటి ఆరోగ్యంతో పాటు జీర్ణ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇవి మంచి మౌత్ ఫ్రెషర్ గా పనిచేయడంతో పాటు మన ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయని వారు తెలియజేస్తున్నారు.

# భారత్ టైటిల్‌ను నిలబెట్టుకోవాలని ఆకాంక్షిస్తున్నా..

## పాండ్యా, అర్షదీప్ సింగ్ కీలక పాత్ర పోషిస్తారు

## భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ వెల్లడి

2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్ గెలుపు అవకాశాలపై రోహిత్ శర్మ కీలక విషయాలు మాట్లాడారు. హార్దిక్ పాండ్యా, అర్షదీప్ సింగ్ కీలక పాత్ర పోషిస్తారని, వారి ఆల్ రౌండ్ నైపుణ్యం, డెత్ ఓవర్ల బౌలింగ్‌కు ప్రాధాన్యతనిచ్చారు. స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి సవాల్‌గా మారతారని, వికెట్ తీసే బౌలర్లకే తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న 2026 టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా గెలుపు అవకాశాలపై భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మెగా టోర్నీలో భారత్ టైటిల్‌ను నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. జట్టులో హార్దిక్ పాండ్యా, అర్షదీప్ సింగ్ పాత్ర అత్యంత కీలకమని రోహిత్ నొక్కి చెప్పారు. ముఖ్యంగా హార్దిక్ పాండ్యా అందించే ఆల్ రౌండ్ బ్యాలెన్స్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు పెద్ద ఊరటనిస్తుందని తెలిపారు. అర్షదీప్ సింగ్ డెత్ ఓవర్లలో అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తాడని, 2024 ఫైనల్‌లో అతని ప్రదర్శనను ప్రశంసించారు. స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి సవాల్‌గా మారతారని పేర్కొన్న రోహిత్.. మంచు ప్రభావం వల్ల ముగ్గురు స్పిన్నర్లతో ఆడటం రిస్క్ అని హెచ్చరించారు. వికెట్ తీయగలిగే బౌలర్లకే తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో కుల్దీప్ యాదవ్‌పై సరదాగా వ్యాఖ్యానిస్తూ, "గల్లీ క్రికెటర్‌లా ప్రతి బంతికి అప్పీల్ చేయొద్దు, రివ్యూల విషయంలో నేను కుల్దీప్‌ని నమ్మను" అని చమత్కరించారు. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరగనున్న ఈ టోర్నీలో భారత జట్టు విజయం సాధించాలని రోహిత్ ధీమా వ్యక్తం చేశారు.




# తారాజువ్వలా ఇషాన్ కిషన్

## గత 4 మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టిన ఇషాన్

## టి20 ప్రపంచకప్‌లో ఓపెనర్‌గా బరిలోకి!?

## అభిషేక్ తో ఇన్నింగ్స్ ప్రారంభించే చాన్స్




టి20 ప్రపంచకప్ 2026 వచ్చే శనివారం ఆరంభం కానుంది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టి20 ప్రపంచకప్ జరగనుంది. ఈసారి మెగా టోర్నీలో పాల్గొనే జట్ల సంఖ్య పెరిగింది. మొత్తం 20 జట్లు పాల్గొంటున్నాయి. భారత్ గ్రూప్ 'ఎ'లో ఉంది. ఇదే గ్రూప్‌లో నెదర్లాండ్స్, నమీబియా, అమెరికా, పాకిస్తాన్ జట్లు కూడా ఉన్నాయి. ఈ టి20 ప్రపంచకప్ జట్టులో డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో భారత జట్టు బరిలోకి దిగుతోంది. 2007లో టి20 ప్రపంచకప్ మొదటిసారి జరగ్గా.. టీమిండియా విశ్వవిజేతగా నిలిచింది. ఇక ఆ తర్వాత 2024లో టి20 ప్రపంచకప్ నెగ్గింది. ప్రస్తుతం భారత జట్టు పటిష్టంగా ఉంది. టి20 ప్రపంచకప్ ముందు ఒక బ్యాటర్ ప్రత్యర్థులను వణికిస్తున్నాడు. ఇటీవలె న్యూజిలాండ్‌తో జరిగిన టి20 సిరీస్‌లో ఎవరూ ఊహించని విధంగా ఇషాన్ కిషన్ రెచ్చిపోయాడు. తిలక్ వర్మ గాయం కారణంగా ఆ సిరీస్‌కు దూరమయ్యాడు. ఫలితంగా భారత జట్టుకు దూరమయ్యాడు. దాంతో అతడి స్థానంలో ఇషాన్ కిషన్ తుది జట్టులోకి వచ్చాడు. మొత్తం 4 మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టాడు. ఒక సెంచరీ.. మరో అర్ధ సెంచరీ బాదాడు.ఇక అదే సమయంలో సంజూ సామ్సన్ పేలవ ప్రదర్శన చేశాడు. ఫలితంగా ఫిబ్రవరి 7 నుంచి ఆరంభమయ్యే టి20 ప్రపంచకప్‌లో టీమిండియా ఓపెనర్‌గా ఇషాన్ కిషన్ బరిలోకి దిగే అవకాశం ఉంది. ప్రస్తుతం అతడు సూపర్ ఫామ్‌లో ఉండటంతో టీమ్ మేనేజ్‌మెంట్ అతడిపై నమ్మకం ఉంచింది. ఇప్పటికే అభిషేక్ శర్మ రూపంలో టీమిండియాకు పవర్ ఫుల్ ఓపెనర్ ఉన్నాడు. అతడికి ఇషాన్ తోడైతే ప్రపంచకప్‌లో టీమిండియాను ఆపడం ఎవరి తరం కాదు. 2023లో ఇషాన్ కిషన్ తారాజువ్వలా దూసుకొచ్చాడు. ఆ ఏడాది జరిగిన ఆసియా కప్‌లో అదరగొట్టాడు. దాంతో వన్డే ప్రపంచకప్ జట్టుకు ఎంపికయ్యాడు. అయితే అతడికి ప్లేయింగ్ ఎలెవెన్‌లో అవకాశాలు రాలేదు. అనంతరం అతడు తీసుకున్న తొందరపాటు నిర్ణయాల వల్ల రెండేళ్లపాటు ఆటకు దూరమయ్యాడు. అయితే 2025 నుంచి అతడి ఆటతీరు మారింది.గతేడాది జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జార్ఖండ్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు. సంచరీల మీద సెంచరీలు బాదాడు. తన జట్టును ఛాంపియన్‌గా నిలబెట్టాడు. అనంతరం జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో కూడా రాణించాడు. ఫలితంగా అతడికి బీసీసీఐ నుంచి పిలుపొచ్చింది. బ్యాకప్ వికెట్ కీపర్‌తో పాటు బ్యాకప్ ఓపెనర్‌గా అతడిని తీసుకున్నారు.ఇక కివీస్‌తో జరిగిన టి20 సిరీస్‌లో సంజూ సామ్సన్ విఫలం కావడం.. ఇషాన్ కిషన్ రెచ్చిపోవడంతో టీమిండియా ప్లేయింగ్ ఎలెవెన్ సమీకరణాలు మారిపోయాయి. టి20 ప్రపంచకప్‌లో ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు.

# డబ్ల్యూపీఎల్‌లోకి చెన్నై సూపర్ కింగ్స్

## సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ వెల్లడి

మహిళల క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్?కే) సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో సీఎస్?కే ఫ్రాంఛైజీ డబ్ల్యూపీఎల్‌లోకి అడుగు పెట్టేందుకు సిద్ధమవుతోంది. తమిళనాడులో జరిగిన 'ఇన్వెస్ట్ ఇన్ తమిళనాడు' సదస్సులో సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ ఈ విషయాన్ని వెల్లడించారు. మహిళల క్రికెట్‌లో పెట్టుబడులు పెట్టడమే తమ మొదటి లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి రాకపోయినా, భవిష్యత్తుల్లో మహిళల క్రికెట్? జట్టులో పెట్టుబడులు పెట్టడానికి ఫ్రాంఛైజీకి స్పష్టమైన ప్రణాళికలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఫ్రాంఛైజీ దీర్ఘకాలిక ప్రణాళికల గురించి అడిగినప్పుడు విశ్వనాథన్? ఇలా అన్నారు. "ప్రస్తుతమే ఈ నిర్ణయం అమల్లోకి రాకపోయినా, భవిష్యత్తులో సీఎస్‌కే తన పరిధిని విస్తరించనుంది. అందులో తొలి ప్రాధాన్యం మహిళల క్రికెట్‌కే ఉంటుంది. కాలక్రమేణా ఇతర క్రీడల్లో కూడా సీఎస్?కే అవకాశాలను అన్వేషించవచ్చు." అని కాశీ విశ్వనాథన్ తెలిపారు. ప్రస్తుతం ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ఐదు జట్లు మాత్రమే ఉన్నాయి. అవి ముంబయి, బెంగళూరు, ఢిల్లీ, గుజరాత్, ఉత్తర్?ప్రదేశ్. అయితే చెన్నై, పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ వంటి ప్రముఖ ఐపీఎల్ ఫ్రాంఛైజీలు ఇప్పటివరకు మహిళల లీగ్‌లోకి ప్రవేశించలేదు.




# కొలంబోలో అడుగుపెట్టిన పాకిస్తాన్ టీమ్

## వివాదాల మధ్యే శ్రీలంకకు పాకిస్తాన్ జట్టు

## ఫిబ్రవరి 7న నెదర్లాండ్స్‌తో తొలి మ్యాచ్

ఐసీసీ టీ – 20 వరల్డ్ కప్ 2026 కోసం పాకిస్తాన్ జట్టు కొలంబో చేరుకుంది. అయితే, భారత్‌తో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ నిర్ణయం వల్ల పాకిస్తాన్ ఆర్థికంగా నష్టపోవడంతో పాటు టోర్నీ ఆదాయంపై కూడా ప్రభావం పడనుంది. మాజీ ఆటగాళ్లు ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు తెలుపుతుండగా, ఐసీసీ పునరాలోచించాలని సూచించింది. ఫిబ్రవరి 15న అసలు ఏం జరుగుతుందో చూడాలి!ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ 2026కు ముందు పాకిస్తాన్ జట్టు శ్రీలంక రాజధాని కొలంబోకు చేరుకుంది. భారత్‌తో జరగాల్సిన కీలక మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేసే అంశంపై కొనసాగుతున్న వివాదాల మధ్యే పాకిస్తాన్ జట్టు శ్రీలంకకు రావడం ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.సల్మాన్ అలీ ఆఘా నాయకత్వంలో ఉన్న 15 మంది సభ్యుల పాకిస్తాన్ జట్టు సోమవారం కొలంబో చేరుకుంది. భారత జట్టుతో ఫిబ్రవరి 15న జరగాల్సిన మ్యాచ్‌లో పాల్గొనవద్దని పాకిస్తాన్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో, ఈ నిర్ణయం చుట్టూ పెద్ద ఎత్తున వివాదం నెలకొంది.టోర్నీకి ముందు సన్నాహాలపై ప్రస్తుతం పాకిస్తాన్ జట్టు దృష్టి సారించింది. మంగళవారం ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చిన జట్టు, బుధవారం ఐర్లాండ్‌తో జరిగే ఏకైక వార్మప్ మ్యాచ్‌లో పాల్గొననుంది. ఈ మ్యాచ్ సింహలీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో జరగనుంది. ఇదే మైదానం గ్రూప్–ఏలో పాకిస్తాన్ ఆడే మూడు మ్యాచ్‌లకు వేదిక కానుంది.గ్రూప్–ఏలో పాకిస్తాన్‌తో పాటు డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, అమెరికా, నెదర్లాండ్స్, నమీబియా జట్లు ఉన్నాయి. పాకిస్తాన్ ఫిబ్రవరి 7న నెదర్లాండ్స్‌తో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. అయితే భారత్ మ్యాచ్ బాయ్‌కాట్ అంశంపై పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ప్రస్తుతం కఠిన పరిస్థితుల్లో చిక్కుకుంది. ఈ నిర్ణయాన్ని పునరాలోచించాలని ఐసీసీ ఇప్పటికే సూచించినట్లు సమాచారం. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే పాకిస్తాన్ భారీ ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని ఐసీసీ హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది.భారత్––పాకిస్తాన్ మ్యాచ్ జరగకపోతే టోర్నీ ఆదాయంపై కూడా తీవ్ర ప్రభావం పడనుంది. ప్రసార హక్కుల సంస్థ జియోస్టార్ ఇప్పటికే తమ ఒప్పందంపై పునర్విమర్శ కోరుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ మ్యాచ్ లేకపోతే ప్రకటనల ద్వారా రూ.200 నుంచి రూ.250 కోట్ల వరకు నష్టం వాటిల్లే అవకాశముందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 10 సెకన్ల ప్రకటనకు రూ.40 లక్షల వరకు వసూలు చేసే స్థాయిలో ఈ మ్యాచ్‌కు ఆదరణ ఉంది.మాజీ కెప్టెన్లు షాహిద్ అఫ్రిది, మహమ్మద్ యూసుఫ్, రషీద్ లతీఫ్, మొయిన్ ఖాన్, సర్ఫరాజ్ అహ్మద్, మొహ్సిన్ ఖాన్ లాంటి పలువురు మాజీ క్రికెటర్లు ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు తెలుపుతూ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే టోర్నీ ప్రారంభానికి సమయం దగ్గర పడుతుండటంతో, పాకిస్తాన్ తుది నిర్ణయం ఏవిధంగా ఉంటుందన్నది అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో ఆసక్తిగా మారింది.






# శరవేగంగా వారణాసి మూవీ షూటింగ్

## రైట్స్ కోసం డిస్ట్రిబ్యూటర్ల క్యూ అంటూ వార్తలు

బాహుబలి, ఆర్ఆర్ఆర్ చిత్రాలతో పాన్ ఇండియా స్థాయి దాటి పాన్ వరల్డ్ రేంజ్‌కి దూసుకువెళ్లారు దర్శకధీరుడు రాజమౌళి. ప్రస్తుతం ఆయన దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'. ఈ చిత్రంలో హీరోయిన్‌గా హాలివుడ్ బ్యూటీ ప్రియాంక చోప్రా నటిస్తుండగా, మలయాళ హీరో పృద్వీ రాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే తాజాగా ఈ సినిమా గురించి ఒక న్యూస్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. ప్రస్తుతం 'వారణాసి' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా షెడ్యూల్ హైదరాబాద్‌లోని కోకాపేట, అల్యూమినియం ఫ్యాక్టరీ పరిసరాల్లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో మహేశ్ బాబు- ప్రియాంక చోప్రాపై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు టాక్. ఈ షెడ్యూల్ క్లోజ్ అయిన వెంటనే, చిత్ర బృందం జార్జియా వెళ్లడానికి రడీ అవుతుందని సమాచారం. ఇదే టైంలో ఈ సినిమా డిస్టిబ్యూషన్ రైట్స్ కోసం డిస్టిబ్యూటర్లు క్యూ కడుతున్నారని సినీ సర్కిల్‌లో జోరుగా ప్రచారం జరుగుతుంది. ఏపీ, తూర్పు గోదావరి ఏరియాకు రూ.18 కోట్ల ఆఫర్ చేస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. నిజానికి ఈ రేంజ్‌లో భారీ ఆఫర్లు వచ్చినా తక్షణమే బిజినెస్ స్టార్ట్ చేసేందుకు జక్కన్న టీమ్ ఆసక్తిగా లేదని సమాచారం. ఎందుకంటే బాహుబలి, ఆర్ఆర్ఆర్ తరహాలోనే వారణాసి మూవీ విషయంలో కూడా రాజమౌళి స్ట్రాటజీ ఉంటుందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అందుకే వారణాసి సినిమా పూర్తయ్యాకే పూర్తి స్థాయి మార్కెట్ వ్యూహంతో డిస్టిబ్యూషన్‌కు వెళ్లాలని రాజమౌళి టీం ప్లాన్ అని చెబుతున్నారు.

# తారక్‌తోనే గాడ్ ఆఫ్ వార్



గాడ్ ఆఫ్ వార్ ..టాలీవుడ్ లో ఈ సినిమా చుట్టూ నడుస్తున్న డిస్కషన్ మరే సినిమాకు ఇటీవల కాలంలో జరగలేదేమో. మొదట ఈ సినిమా అల్లు అర్జున్ హీరోగా త్రివిక్రమ్ డైరెక్షన్ లో వస్తుందని ప్రకటించారు. కానీ బన్నీ నటించిన పుష్ప తర్వాత సీన్ మారింది. పాన్ ఇండియా మార్కెట్ పై కన్నేసిన బన్నీ తెలుగు దర్శకులతో సినిమా చేసే ఇంట్రెస్ట్ చూపలేదు. దాంతో త్రివిక్రమ్ ఈ కథని ఎన్టీఆర్ చేయాలనీ డిసైడ్ అయ్యాడు. ఎన్టీఆర్ కు కథ చెప్పడం అందుకు ఓకే చెప్పడం కూడా జరిగింది. ఎన్టీఆర్ కూడా కుమారస్వామికు సంబంధించి బుక్ ను చదువుతూ మీడియా కంటపడంతో త్రివిక్రమ్ ? ఎన్టీఆర్ సినిమా ఫిక్స్ అని న్యూస్ హల్ చల్ చేసాయి. యుద్దానికి అధిపతిగా, దైవ స్వరూపంగా తారక్ నటన మరియు ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అయ్యారు. ఇంతకుముందు ఎన్నడూ చూడని విధంగా ఒక విజువల్ గ్రాండియర్‌గా త్రివిక్రమ్ ఈ కథను సిద్ధం చేసాడని టాక్ వినిపించింది. కానీ మొన్నామధ్య ఈ సినిమాని అల్లు అర్జున్ చేయాలనుకుంటున్నట్టు బాలీవుడ్ మీడియాతో ఫేక్ ప్రాపగాండా చేశారు. దాంతో అసలు ఈ సినిమా ఎవరితో ఉంటుందా అని కన్ఫ్యూజ్ అయ్యారు సినిమా ప్రేక్షకులు. ఇక ఇప్పుడు లేటెస్ట్ గా అన్ని గందరగోళాల తర్వాత చివరికి తారక్ వద్దకు వచ్చి చేరింది. ప్రస్తుతం ఎన్టీఆర్ చేస్తున్న ప్రశాంత్ నీల్ సినిమా జూన్ 2026 నాటికి పూర్తి కానుంది. ఆ వెంటనే అంటే 'గాడ్ ఆఫ్ వార్ సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది. ఈ లోపు త్రివిక్రమ్ ప్రస్తుతం చేస్తున్న వెంకీ సినిమా పూర్తి చేసి, ఈ పౌరాణిక చిత్రం కోసం ప్రీ-ప్రొడక్షన్ పనులను పక్కాగా సిద్ధం చేస్తున్నారు. హారిక హాసిని క్రియేషన్స్ మరియు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ సినిమాను పాన్-వరల్డ్ స్థాయిలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాయి.

# మాళవిక సోయగాలు అదరహో!



ఈమధ్య కాలంలో వెరైటీ ఇండియా రూపొందిస్తున్న ఫ్యాషన్ దుస్తులతో హీరోయిన్స్ తమ అందాన్ని మరింత రెట్టింపు చేసుకుంటున్నారు. ముఖ్యంగా తమ అందాలతో ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా వెరైటీ డ్రెస్ లతో ఫ్యాషన్ ప్రియులకు మరింత స్పెషల్ అట్రాక్షన్ గా కనిపిస్తున్నారు. ఇందులో బాగానే మలయాళీ ముద్దుగుమ్మ మాళవిక మోహనన్ కూడా తాజాగా వెరైటీ ఇండియా డిజైన్ చేసిన బ్లాక్ అవుట్ ఫిట్ తో అందరి దృష్టిని ఆకట్టుకుంది.ఇటీవలే రకుల్ ప్రీత్ సింగ్ వెరైటీ డ్రెస్ తో మెస్మరైజ్ చేయగా.. ఇప్పుడు మాళవిక కూడా అలాంటి తరహా డ్రెస్ లోనే ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. టాప్ ట్రెండీ ఔట్ ఫిట్ ధరిస్తూనే.. బాటమ్ చీరకట్టులో కనిపిస్తూ సరికొత్తగా కనిపించింది. ముఖ్యంగా ఫ్యాషన్ ప్రియులను విపరీతంగా ఆకట్టుకుంటుంది ఈ ఔట్ ఫిట్. ఇక చేతులకు గోల్డెన్ కడ ధరించి తన మేకోవర్ ను ఫుల్ ఫిల్ చేసింది. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకున్న ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. మలయాళ బ్యూటీగా పేరు తెచ్చుకున్న ఈమె తొలిసారి తెలుగులో ప్రభాస్ హీరోగా.. మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన ది రాజా సాబ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాలో మాళవికతో పాటు రిద్ధీ కుమార్, నిధి అగర్వాల్ కూడా హీరోయిన్లుగా నటించారు. ఇకపోతే భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ సినిమా మాత్రం ఏడాది సంక్రాంతి బడిలో నిలిచి డిజాస్టర్ గా నిలిచింది. అయినా సరే మాళవిక మోహనన్ కి మాత్రం మంచి గుర్తింపు లభించిందని చెప్పవచ్చు. ఇకపోతే ఈమె ఎవరో కాదు ప్రముఖ మలయాళ సినిమాటోగ్రాఫర్ కేయు మోహనన్ కుమార్.. 2013లో వచ్చిన మలయాళ చిత్రం పట్టంపోల్ సినిమా ద్వారా నటన రంగ ప్రవేశం చేసింది. ఇక తర్వాత ది గ్రేట్ ఫాదర్ , పెట్ట , మాస్టర్ , హృదయపూర్వం వంటి సినిమాలలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈమె 1993 ఆగస్టు 4న కేరళలోని కన్నూరు జిల్లాలోని పయ్యనూరు పట్టణంలో జన్మించింది. కానీ ముంబైలో పెరిగింది. ప్రస్తుతం కార్తీ హీరోగా నటించిన సర్దార్ సినిమా సీక్వెల్ సర్దార్ 2లో నటిస్తోంది. తమిళ భాష పై యాక్షన్ థ్రిల్లర్ మూవీకి పిఎస్ మిత్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. రత్నకుమార్ , ఆశామీరా అయ్యప్పన్ , విగ్నేష్ మునియాండి రచన , నంబి స్క్రీన్ ప్లే అందించారు. ప్రిన్స్ పిక్చర్స్, ఐవి ఎంటర్టైన్మెంట్ బ్యానర్లపై ఈ చిత్రం రూపుదిద్దుకుంటుంది. ఇందులో కార్తీక్, రజీషా విజయన్ తో పాటు మాళవిక మోహనన్ కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరితోపాటు ఆషికా రంగనాథ్, ఎస్ జె సూర్యా కూడా ఈ సర్దార్ 2 లో భాగం కానున్నారు. 2024 జూలైలోనే షూటింగ్ ప్రారంభమైన ఈ సినిమా ఈ ఏడాది జూన్లో విడుదల కానున్నట్లు సమాచారం.

# పీఆర్‌పై పెద్దగా ఆధారపడను : రకుల్ ప్రీత్ సింగ్



బాలీవుడ్‌లో ఎప్పుడూ ఏదోఒక అంశం వైరల్‌గా మారుతూనే ఉంటుంది. ఒకప్పుడు బంధుప్రీతిపై, కొన్ని రోజుల క్రితం వర్కింగ్ అవర్స్ చర్చనీయాంశమైంది. ఇప్పుడు పీఆర్ వ్యవస్థపై అందరూ కామెంట్స్ చేస్తున్నారు. హిందీ చిత్ర పరిశ్రమలో పీఆర్ వ్యూహాలు మరో స్థాయికి చేరాయని పేర్కొంటున్నారు. తాజాగా నటి రకుల్ ప్రీత్ సింగ్ ఓ ఇంటర్వ్యూలో పబ్లిసిటీ సంస్కృతిపై స్పందించారు. 'పీఆర్ వ్యవస్థలు ఒక స్థాయి వరకూ మాత్రమే పనిచేయగలవు. మనం కష్టపడి పని చేసినప్పుడే దానికి తగిన ఫలితం వస్తుంది. గతంతో పోలిస్తే హిందీ చిత్ర పరిశ్రమలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. డబ్బు చెల్లించి ఇతరులపై బురద చల్లుతున్నారు. ఇంత నెగెటివిటీ సృష్టించే వాళ్లకు నిద్ర ఎలా పడుతుంది. వాళ్లకు మనస్సాక్షి ఉండదా అని ఎప్పుడూ అనుకుంటాను. ఇలాంటివారు ఎప్పటికైనా ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. నేను స్వయంగా ఎదిగి ఈ స్థాయికి వచ్చాను. నాకు పీఆర్ అవసరం లేదని అన్నారు. ఇక ఫొటోగ్రాఫర్లపై కూడా రకుల్ అసహనం వ్యక్తంచేశారు. తాను ఒకే జీన్స్‌ను నెలకు ఐదు సార్లు వేసుకుంటానని అన్నారు. ఈ విషయాన్ని కూడా ఫొటోగ్రాఫర్లు పరిశీలిస్తున్నారని, వారికి హద్దు ఉండాలని చెప్పారు. తాను దుస్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనని తెలిపారు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463